రూ॥ 10/-

జనరాజకీయం కోసం

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 1 సంచిక - 1

పక్షపత్రిక

జనవరి 1-15, 2010




## ఉద్యమాల నేపథ్యంలో

## లోక్‌సత్తా పార్టీ ఏం చెబుతోంది?




# Happy New Year

## 2010లో మీరందరూ విజేతలుగా నిలవాలి



మిమ్మల్ని వంచన చేస్తున్న రాజకీయ పార్టీలకు, మీకు మధ్య
జరుగుతున్న పోరాటంలో మీరందరూ విజేతలుగా నిలవాలని

సహృద్భావ వాతావరణంలో అందరి ఆకాంక్షలని
అర్థం చేసుకుని విజ్ఞతతో పరిష్కారం సాధించాలని

జాతీయస్ఫూర్తితో సామరస్య సహజీవనంలో
యావత్‌దేశానికే ఆదర్శంగా నిలవాలని

మీ అభ్యున్నతిని, ప్రజలకే అధికారమన్న మా ఆశయాన్ని
ఈ సంవత్సరం నిజం చేస్తారని ఆశిస్తూ....

సాదర హృదయంతో

మీ

## పునః సమీక్షకు సమయం

ఏ సమాజంలో అయితే నీతి తప్పిన వారు విజయం సాధిస్తారో,
ఎక్కడైతే నేరస్థులు ఆరాధ్యులుగా మారతారో
ఎక్కడైతే విలువలు పతనమై
అవకాశవాదం రాజ్యమేలుతుందో
ఎక్కడయితే అవినీతి సర్వత్రా
తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా
తమకు కావలసిన వాటా కోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో
అక్కడ వ్యవస్థకు సంబంధించిన
పునః సమీక్షకు సమయం అసన్నమైందని అర్థం
అప్పుడు తమ గురించి, తమకు సబంధంచిన వారి గురించి,
తమ చుట్టూరా వున్నవారి గురించి, తమ కార్యకలాపాలకు
సంబంధించి అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి.

- క్లిట్‌గార్డ్, ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త

## లోపలి పేజీల్లో...


1. సంక్షోభ నివారణకై న్యూఢిల్లీ పర్యటన ............. 5
2. ఆర్థికమాంద్యంలో ప్రపంచం - హాని చేస్తున్న అవినీతి.................................... 8
3. పౌరులు కేంద్రంగా పాలన ............................. 9
4. కేశవరంలో లోక్‌సత్తా కొత్త రాజకీయం.............. 11
5. జె.పి అభివృద్ధి పనుల జాబితా......................... 13
6. సంప్రదాయ పార్టీల జిత్తులను ఎదుర్కోవాలి...... 15
7. పౌరసేవాకేంద్రాలు ......................................... 16
8. జిల్లా ప్రభుత్వాలపై రాజకీయ నాయకులు తెలుసుకోవాలి ........................... 17
9. సామాజిక మార్పు లోక్‌సత్తాతోనే సాధ్యం........... 18
10. కదిలిన సంప్రదాయ పార్టీల పునాదులు............ 19
11. లోక్‌సత్తా పార్టీ ఆవశ్యకత........................... 20
12. పెయిడ్ ఆర్టికల్స్ మీడియా చీకటికోణం.......... 25
13. మహిళాసత్తా .............................................. 26
14. యువసత్తా, విద్యార్థి సత్తా ............................ 27
15. జిల్లాల్లో లోక్‌సత్తా పార్టీ ................................. 28


# నాంది

కె.సి ఆర్. ఆమరణ నిరాహార దీక్ష, ఉవ్వెత్తున ఎగసిన జై తెలంగాణ ఉద్యమం, కేంద్ర హోంమంత్రి చిదంబరం ప్రకటన, ఆంధ్రప్రాంత ప్రజాప్రతినిధుల రాజీనామాల పర్వం, ప్రజ్వరిల్లిన సమైక్యాంధ్ర ఉద్యమజ్వాలలు - వెరసి తెలంగాణ, ఆంధ్ర సీమప్రాంతాల సామాన్య ప్రజల వెతలు.

**సంపాదకీయం**

తరతరాలుగా దోపిడీకి గురవుతున్నామన్న బాధ, తమ సంస్కృతీ సంప్రదాయాల ప్రత్యేకత కాపాడుకోవాలన్న తపన తెలంగాణ ప్రాంతీయులది. అప్పుడు చెన్నపట్టణం, ఇప్పుడు భాగ్యనగరం, అభివృద్ధిలో భాగస్వాములై అర్థంతరంగా వదులుకోవాల్సిన దుస్థితి, ఫుట్‌బాల్‌లా అందరూ ఆడుకుంటూ తమని ఎటూకాని స్థితిలోకి నెడుతున్నారన్న ఆవేదన ఆంధ్ర, సీమ ప్రాంతీయులది.

ఇరువైపులా వున్న అసంతృప్తి జ్వాలలను సమర్థవంతంగా ఎగదోసి తమ పబ్బం గడుపుకోవాలని చూసిన సంప్రదాయ రాజకీయ పార్టీల, నాయకుల ద్వంద్వనీతి దుశ్చర్యల ఫలితమే ప్రస్తుత దురవస్థ. ఉద్యమాలు ప్రజల ఆకాంక్షలను తెలియజెప్పి పరిష్కారాలకు పరిణమించాలే తప్ప పరస్పర కార్పణ్యాలకు, విద్వేషాలకు దారితీయకూడదన్న కనీస ఇంగితజ్ఞానం రాజకీయుల్లో లోపించడం వల్ల పదుల సంఖ్యలో విలువైన ప్రాణాలు కోల్పోవడం, వందల కోట్ల ఆస్తి నష్టం, వేలాది విద్యార్థుల విలువైన సమయం వృథాకావడం.

స్వతంత్ర భారతావనిలో ప్రజల అభిప్రాయాలకు, అవసరాలకు విలువనిచ్చే రాజకీయం రావాలి. ప్రాంతాల మధ్య అసమానతలకు, దోపిడీ, విద్వేషాలకు తావులేని స్థానిక స్వయం పరిపాలన స్ఫూర్తితో రాజ్యాంగం ద్వారా సంక్రమించిన జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు ద్వారా పరస్పర గౌరవాభిమానాలు పరిఢవిల్లే ప్రజాస్వామ్యం భవిష్యత్ భారత జీవన సారం. లోక్‌సత్తా పార్టీ వేస్తున్న బుడిబుడి అడుగులే ఆ అనంత ప్రస్థానానికి నాంది.

**మార్పు వస్తుందన్న నమ్మకం నశించిపోయిన మనసుల్లో**
**కొత్త ఆశల్ని, కొత్త విశ్వాసాన్ని కల్పించడం మన లక్ష్యం కావాలి**

## లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

**జనవరి 1-15, 2010 సంపుటి - 1 సంచిక - 1**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

ముద్రణ : కళాజ్యోతి అఫ్‌సెట్ ప్రింటర్స్, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

ప్రచురణ : డా॥ జయప్రకాష్ నారాయణ్

ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తరపున,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


## మన రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు

మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజాస్వామిక వ్యవస్థకు పునాది అయిన ప్రాథమిక హక్కులను రాజ్యాంగం 3వ భాగంలో వివరంగా పొందుపరచడం జరిగింది. అవి

1. సమానత్వపు హక్కు
2. స్వేచ్ఛా స్వాతంత్ర్యపు హక్కులు
3. పీడన నిరోధపు హక్కు
4. మత స్వాతంత్ర్యపు హక్కు
5. విద్యా సాంస్కృతిక హక్కు
6. రాజ్యాంగ పరిహారాల హక్కు

మొదట్లో ప్రసాదించబడి అనంతరం రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుండి తొలగించబడిన ఆస్తి హక్కు కేవలం చట్టపరమైన హక్కుగా కొనసాగుతోంది.

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

**అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించడం సురాజ్య ఉద్యమ లక్ష్యం**

## సమాచారం పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన సమాచారాన్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు. లోక్‌సత్తా పార్టీ స్థానిక కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని (వీలైతే ఫొటోలతో పాటు) పంపించండి. ప్రచురణార్హమైన రచనల్ని వీలువెంబడి వరుసగా ప్రచురిస్తాం. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజీ | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజీ 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుముపేరిట Foundation for Democratic Reforms హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/ డిడి రూపంలో చెల్లింగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

### మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
loksattatimeslsp@gmail.com

### లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500



# సంక్షోభ నివారణకై న్యూఢిల్లీ పర్యటన

తెలంగాణ విషయంలో తీర్మానానికి కట్టుబడి ఉన్నామని నిన్నటివరకూ ప్రజలకు నమ్మబలికిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలలో శాసనసభ్యులు, ఇతర నేతలు ప్రత్యేక తెలంగాణపై స్పష్టమైన హామీ వచ్చిన కొన్ని గంటలలోనే రాజీనామాలు చేయటం ప్రారంభించటం ఆ రెండు పార్టీలూ ప్రజల్ని ఎంత మోసం చేశాయో నగ్నంగా బట్టబయలు చేసింది. ఎన్నికల్లో గెలవటానికి అప్పటికి తాత్కాలిక హామీలిచ్చి ప్రజల్ని మోసం చేసి, దాన్ని నిజంగా అమలు చేయాల్సి వచ్చేసరికి ఆ రెండు పార్టీలూ తప్పించుకోచూస్తున్నాయి.

తెలంగాణపై కేవలం 24గంటల వ్యవధిలో ముఖ్యమంత్రి రోశయ్య, ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు మాటమార్చిన వైనం రాష్ట్రంలో ప్రధాన సంప్రదాయపార్టీల పచ్చిదగాకోరు రాజకీయానికి అద్దంపడుతోంది. “తెలంగాణ రావాలంటే అసెంబ్లీలో తీర్మానం ఆమోదం పొందాలి గదా అని రోశయ్య ... తూచ్, విస్తృత ఏకాభిప్రాయ సాధన లేకుండా తీర్మానం ముందుకు రాదు అనుకున్నాను అని చంద్రబాబు నాయుడు తప్పించుకోచూడటం పేకాటలో బ్లఫ్ ఆటలాగా ప్రజల్ని అమాయకుల్ని చేసి నిస్సిగ్గుగా మోసం చేసే ధోరణి తెలంగాణకు మద్దతునిస్తున్నట్టు ప్రజల్ని ఇన్నాళ్లూ మోసం చేసిన పార్టీలు అనూహ్యంగా ఆ ప్రతిపాదన ఆమోదం పొందగానే దిక్కుతోచక తప్పించుకునే మార్గాలు వెతుకుతున్నాయి. ఎన్నో కోట్లు ఖర్చు చేసి ఎన్నికల్లో నెగ్గినవారు సైతం మాసిన బట్టలు విడవటం కంటే వేగంగా పదవులకు రాజీనామాలు చేస్తున్నారంటే, ఆ నిర్ణయం పట్ల వారి అంతరాత్మల్లో ఎంత వ్యతిరేకత ఉందో, ప్రజల నుంచి ఎంత ఒత్తిడి ఉందో అర్థమవుతుంది. “మీరంతా చెప్పారు కాబట్టే తెలంగాణ ఇస్తున్నామన్నట్టు అధిష్టానం తమ పార్టీలు మోసపూరితంగా వ్యవహరించాయి కాబట్టే రాజీనామా చేస్తున్నామని శాసనసభ్యులు వెరసి ఈ మొత్తం ప్రజల్ని మోసం చేసేందుకు ఆడుతున్న వికృత రాజకీయ క్రీడను కళ్లకు కడుతోంది.

**హింసకు లొంగటం చాలా ప్రమాదకర సంప్రదాయం**

తెలంగాణ అంశంపై హింసకు, విధ్వంసానికి లొంగిపోవటం ద్వారా భారత ప్రభుత్వం చాలా ప్రమాదకరమైన సంప్రదాయానికి తెరతీసింది. సమస్యల్ని ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించుకునేందుకు మనకు సమగ్రమైన, విశిష్టమైన రాజ్యాంగం ఉంది. కానీ రాజ్యాంగబద్ధ మార్గాన్ని వదిలేసి ఎన్నికైన ఎమ్మెల్యేల, ఎంపీల అభిప్రాయాన్ని సైతం పరిగణనలోకి తీసుకోకుండా  తెలంగాణపై నిర్ణయం తీసుకున్న తీరు రాబోయే కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వెన్నాడుతూనే ఉంటుంది.



**వంచనను ఇకనైనా గుర్తించాలి... ఆట కట్టించాలి**

దశాబ్దాలుగా రాజకీయపార్టీలు తమను వంచిస్తూ ఎలా బిచ్చగాళ్లుగా కొనసాగిస్తున్నాయో ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలి. ఎన్నికలను పార్టీల మధ్య, నాయకుల మధ్య పోరుగా చూస్తూ ప్రజలు చోద్యం చూస్తున్నంత వరకూ పార్టీలు ఇదే తీరుగా మోసం చేస్తూ దోచుకుంటుంటాయి. పార్టీల కోసం తాము లేమని, పార్టీలు తమ కోసం ఉన్నాయని ఓటర్లు ఇప్పటికైనా అర్థంచేసుకోవాలన్నారు. అధికారంలోకి రావటం కోసం కులం, మతం, భాష, ప్రాంతం వంటి ఉద్రేకాలను రెచ్చగొట్టి ప్రజల్ని పావులుగా ఉపయోగించుకోవటంలో సంప్రదాయపార్టీలు ఇప్పటివరకూ సఫలమయ్యాయి, ఇక వారి ఆటలు కట్టించాలి.

**సంయమనంతో, ఆరోగ్యకరమైన చర్చతో పరిష్కరించుకుందాం సంక్షోభాన్ని ఓ అవకాశంగా మలచుకుందాం**

ఆరోగ్యకరమైన చర్చ ద్వారా సమస్యల్ని పరిష్కరించుకునేలా అన్ని ప్రాంతాలవారూ ముఖ్యంగా యువత, విద్యార్థులూ సంయమనంతో వ్యవహరించాలి.  “విద్వేష రాజకీయాల్ని మనం తిరస్కరించాలి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు సుహృద్భావంతో, నిజాయతీతో కూడిన పరిష్కారాన్ని వెతకాల్సుంది. ప్రతి జిల్లాలో, నగరంలో, పట్టణంలో, గ్రామంలో ప్రజలకు అధికారం ఇవ్వటమే మన గణతంత్ర వ్యవస్థ పునర్నిర్మాణంలో ప్రధాన సూత్రం కావాలి”. ఎవరి పట్లా ద్వేషం లేకపోవటం, అందరి పట్లా వితరణతో ఉండటం మన లక్ష్యం కావాలి. ఏ కులంలో, ఏ కుటుంబంలో పుట్టినా ప్రతి బిడ్డా వికసించేందుకు అవకాశాల్ని కల్పించాల్సుంది.

రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ సంక్షోభాన్ని రాజకీయాల స్వభావాన్ని మార్చేందుకు ఒక అవకాశంగా ప్రజలు వినియోగించుకోవాలి. “ఈ సంక్షోభం సంప్రదాయపార్టీల అవకాశవాద, దివాళాకోరు రాజకీయాన్ని నగ్నంగా చూపుతోంది. రాజకీయాన్ని పార్టీలు తమ మీద స్వారీ చేసి దోపిడీ చేసే సాధనంగా కాకుండా, తమ బిడ్డలకు, కుటుంబాలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, జీవనోపాధిని కల్పించే సాధనంగా మలిచేందుకు నడుంబిగించాలి”

**తెలంగాణపై లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతున్న విధానానికే పూర్తిగా కట్టుబడి ఉంది.**

చిన్న రాష్ట్రాల ఏర్పాటులో, తెలంగాణ విషయంలో 9ఏళ్లనుంచీ లోక్‌సత్తా ఉద్యమంగా చెబుతున్న విధానానికే లోక్‌సత్తా పార్టీ కట్టుబడి ఉంటుంది. చిన్నరాష్ట్రాల ఏర్పాటుకు మేము వ్యతిరేకం కాదు. అయితే నిర్ణయాలు వీధుల్లో, తాత్కాలిక ఉద్రేకాలతో కాకుండా రాజ్యాంగబద్ధంగా, చట్టసభల్లో, భాగస్వాములందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా జరగాలన్నదే లోక్‌సత్తా విధానం. కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా మనం భారతీయులమని, కలిసి బతకాల్సుంటుందని గుర్తుంచుకుని వ్యవహరించాలి. ఒక రాష్ట్రం ఏర్పడటం వల్లో లేక విలీనం కావటం వల్లో ప్రజల జీవితాల్లో మార్పురాదు, రాజకీయం మారి ప్రజల చేతికి అధికారం వచ్చి, వాళ్లకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, జీవనోపాధి అవకాశాలు లభించినప్పుడు మాత్రమే ప్రజల జీవితాలు మారతాయి. ఈ పరిధిలోనే ఈ అంశాన్ని చూడాలని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు వల్ల ఏదో అద్భుతం జరుగుతుందన్న భావనో, రాష్ట్రం విడిపోవటం వల్ల ఏదో ప్రళయం వస్తుందన్న ఆందోళనో ఎవరికీ అక్కర్లేదని లోక్‌సత్తా విజ్ఞప్తి చేస్తోంది.

***ఒక రాష్ట్రం ఏర్పడటం వల్లో లేక విలీనం కావటం వల్లో ప్రజల జీవితాల్లో మార్పురాదు, రాజకీయం మారి ప్రజల చేతికి అధికారం వచ్చి, వాళ్లకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, జీవనోపాధి అవకాశాలు లభించి నప్పుడు మాత్రమే ప్రజల జీవితాలు మారతాయి.***

***ఢిల్లీ పర్యటన***

"ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న విద్వేషపూరిత వాతావరణాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరటంతోపాటు, అందరికీ ఆమోదయోగ్యంగా రాజ్యాంగబద్ధంగానే ప్రస్తుత సంక్షోభంపై నిర్ణయం తీసుకోవాలనే లోక్‌సత్తా విధానంలో భాగంగా చెబుతున్న పరిష్కారాలను వివరించేందుకు" లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడుగా, ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, యూపీయే ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ తదితర కీలక జాతీయ నేతల్ని కలిసి చేస్తున్న విజ్ఞప్తికి అందరూ సానుకూలంగా స్పందించారు.

***పార్టీలు మాటమార్చటం వల్లే ఇంత సమస్యని ప్రధాని ఆవేదన***

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు కేంద్రప్రభుత్వం అర్ధరాత్రి ప్రకటన చేసిన తీరు, హింసకు తలొగ్గి అంగీకరించినట్టు సంకేతాన్నివ్వటం సరైనదికాదు. ప్రజల మధ్య విద్వేషాలు పెరిగి అగాథం ఏర్పడిందని, తమను సంప్రదించకుండా హఠాత్తుగా నిర్ణయాలు వెలువడ్డాయన్న భావన నెలకొంది అని జాతీయనేతలకు వివరించటం జరిగింది. అయితే తెలుగుదేశం సహా పెద్దపార్టీలన్నీ తెలంగాణకు మద్దతునిస్తున్నట్టు విస్పష్టంగా పేర్కొంటూ అఖిలపక్షంలో కూడా తెలియచేయటం వల్లే తాము సంకోచం లేకుండా నిర్ణయాన్ని ప్రకటించినట్టు ప్రధాని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండటంతో కేంద్రం మీద ఒత్తిడి ఉందని తెలిపారు. రాజకీయపార్టీలు మాటతప్పుతాయని తాను ఊహించలేదని, భారత ప్రభుత్వానికి ఒక నిర్ణయాన్ని తెలియచేసేటప్పుడు చాలా స్పష్టతతో వ్యవహరించాలన్న స్పృహ పార్టీలకు ఉండాలని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు.



**రాష్ట్రంలో సంక్షోభం పరిష్కారానికి లోక్‌సత్తా ఫార్ములా...**

1) డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనకు సూత్రప్రాయంగా కట్టుబడి ఉండాలి. దాన్నుంచి వెనక్కి మళ్లటం ప్రమాదకరం. ఇంత పెద్దదేశంలో, ఇంత పెద్ద రాష్ట్రం విషయంలో చేసిన ప్రకటనకు కట్టుబడి ఉండకపోతే భవిష్యత్తులో దేశసమైక్యతకు సవాళ్లు ఎదురవుతాయి.

2) అదేసమయంలో బలవంతంగా అభిప్రాయాల్ని రుద్దటం కూడా మన ఫెడరల్ వ్యవస్థలో సాధ్యంకాదు. సమస్య మరింత తీవ్రమవుతుంది. కాబట్టి ఈ అంశంలో భాగస్వాములందర్నీ కూర్చుండబెట్టి చర్చించి సామరస్య వాతావరణంలో అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కారాన్ని రూపొందించాలి.

3) ఈలోగా తెలంగాణ ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చేలా, రాష్ట్రంలోని ఇతర వెనకబడిన ప్రాంతాల ఆందోళనల్ని కూడా పరిష్కరించేలా మధ్యంతర చర్యల్ని చేపట్టాలి. ప్రాంతీయ కమిటీల్ని పునరుద్ధరించి వాటికి రాజ్యాంగబద్ధత కల్పించి నిధుల్ని, విధుల్ని కేటాయించి స్థానిక శాసనసభ్యులే వాటి బాధ్యతలు చేపట్టే ఏర్పాటు చేయటం, జిల్లా కౌన్సిళ్లు ఏర్పాటు చేసి ప్రజలకే అధికారాన్నిచ్చే ఏర్పాటుచేయటంతో పాటు రాష్ట్రంలోని వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి.

4) తర్వాత ఆమోదయోగ్య పరిష్కారం వెలువడ్డాక దాన్ని అనుసరించి రాజ్యాంగపరమైన చర్యల్ని వెంటనే ప్రారంభించాలి.

... అని ప్రస్తుత సంక్షోభాన్ని ఎవరికీ నష్టంలేని రీతిలో, భావితరాలకు ప్రయోజనం ఉండేరీతిలో, దేశనిర్మాణానికి ఉపయోగపడే రీతిలో పరిష్కారం చూపటం జరిగింది. ఓ సంక్షోభాన్ని మంచి రాజకీయం దిశగా రాజకీయ పునరేకీకరణకు, అధికార వికేంద్రీకరణకు అవకాశంగా మలచాలి. లోక్‌సత్తా తరుపున ఈ ఫార్ములాను ప్రధానికి, జాతీయ అగ్రనేతలకు వివరించటం జరిగింది.

***అన్ని ప్రాంతాలకూ 'విన్-విన్' పరిష్కారం రావాలి***

"రాష్ట్రంలోని తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో ఉవ్వెత్తున లేచిన విద్వేషాల్ని చల్లార్చటం తక్షణ కర్తవ్యం. రాష్ట్రంలో అప్పుడున్న పరిస్థితులను దృష్ట్యా డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు కేంద్రప్రభుత్వం విధానపరమైన ప్రకటన చేసింది. భారత ప్రభుత్వం చేసిన విధాన ప్రకటనను ఆషామాషీగా తీసుకోలేం. ఇష్టమొచ్చినట్టు ఉల్లంఘించలేం. భారతదేశ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం యొక్క విశ్వసనీయత ఎంతో కీలకం. రాజకీయ

అవసరాల కోసం దాన్ని తోసిపుచ్చలేం. అదేసమయంలో, భారతదేశం సమాఖ్య, ప్రజాస్వామిక రిపబ్లిక్ కూడా. ప్రజల ఆకాంక్షలను, భయాందోళనలను పట్టించుకోకుండా తన సొంత నిర్ణయాన్ని ఓ పెద్దరాష్ట్రం మీద రుద్దలేదు. రాష్ట్రంలోని ఓ ప్రాంతం విడిపోవాలనుకుంటే, మరోప్రాంతం కలిసిఉండాలని కోరుకుంటున్న విచిత్ర పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో నెలకొంది. ఇద్దరి డిమాండ్లనూ ఒకేసారి పరిష్కరించటం సాధ్యంకాదు. భారత ప్రభుత్వం ఎంతో విజ్ఞతతో, విశ్వసనీయతతో, ముందుచూపుతో వ్యవహరించాల్సి ఉంది. ఏమాత్రం ఏకపక్షంగా వ్యవహరించకూడదు. రాష్ట్ర భవిష్యత్తుపై ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించేందుకు పూర్తి అవకాశాన్ని కల్పించాలి. రెండుపక్షాలూ ఇచ్చిపుచ్చుకునే ధోరణితో, అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చేలా, ఆందోళనల్ని పరిష్కరించేలా సంతృప్తికర పరిష్కారాన్ని సాధించాలి. తొందరపాటు, తాత్కాలిక ధోరణితో సమస్యను దాటవేసే ప్రయత్నం జరగకూడదు. ప్రజాస్వామ్యంలో విజేతలు, పరాజితులు ఉండరు. అందరూ గెలిచే 'విన్-విన్' పరిస్థితి ఉండాలి... వీటన్నిటినీ కీలక నేతలకు వివరించటం జరిగింది.

ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు రాజ్యాంగబద్ధ ప్రక్రియల్లోనే జరగాల్సి ఉంది. తాత్కాలిక రాజకీయలబ్ధి కోసం ప్రజల ఉద్వేగాలను రెచ్చగొట్టటం గణతంత్ర వ్యవస్థకు తీరని చేటు కలిగిస్తుంది. భారత్ పరిణతి కలిగిన ప్రజాస్వామ్యం, జాతి విద్వేష పోరాటంలో 800,000 ప్రాణాల్ని బలితీసుకున్న రువాండా లాగా కాకుండా పరిణతితోనే ఈ సమస్యల్ని పరిష్కరించుకుంటుంది. "సమస్యలు సవాలు చేస్తున్నాయిగానీ, అవి పరిష్కరించలేనివి మాత్రం కావు. సుహృద్భావంతో మనం ఖచ్చితంగా పరిష్కారాన్ని కనుగొనగలం".

**రాష్ట్రంలోని ఓ ప్రాంతం విడిపోవాలనుకుంటే, మరోప్రాంతం కలిసిఉండాలని కోరుకుంటున్న విచిత్ర పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో నెలకొంది. ఇద్దరి డిమాండ్లనూ ఒకేసారి పరిష్కరించటం సాధ్యంకాదు.**

తెలంగాణ సమస్యపై శాశ్వత పరిష్కారం దీర్ఘకాలంలో పెండింగ్‌లో ఉండటం అనేక అనర్థాలకు దారితీసింది. ప్రభుత్వం ఇక ఏమాత్రం అలసత్వాన్ని ప్రదర్శించకూడదు. ప్రణబ్ ముఖర్జీ కమిటీ వేసి ఆరేళ్లయినా సాధించింది దాదాపు శూన్యం. రాష్ట్రంలో రోశయ్య ఆధ్వర్యంలోని కమిటీ అసలు పనే ప్రారంభించలేదు.

**కేంద్రప్రభుత్వమే చొరవ తీసుకుని చర్చల ప్రక్రియ ప్రారంభించాలి**

ప్రజల జీవితాలతో పార్టీలు జూదమాడటం వల్లే రాష్ట్రంలో ఈరోజు విద్వేషపూరిత వాతావరణం నెలకొంది. దీన్ని సరిచేసేందుకు మూడుదశల్లో చర్యల్ని వెంటనే ప్రారంభించాలి. "తక్షణం అన్ని ప్రాంతాల మధ్య చర్చల ప్రక్రియను ప్రారంభించాలి. ఇందులో పార్టీలతోపాటు పౌరసమాజాన్ని, ప్రజాప్రతినిధుల్ని, ప్రజల అభిప్రాయాల్ని భాగస్వామ్యం చేయాలి. ఈ ప్రక్రియను ప్రారంభిస్తూనే తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు, ఉత్తరాంధ్ర,



రాయలసీమ, ఇతర వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి వెంటనే ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి. ప్రజల చేతికి అధికారాన్నిచ్చేలా ప్రాంతీయ మండళ్లకు రాజ్యాంగబద్ధతను కల్పించి అందులో ఎమ్మెల్యేలను భాగస్వాముల్ని చేసి, నిధుల్ని, విధుల్ని ఇవ్వాలి. దాంతోపాటు జిల్లా కౌన్సిళ్లను ఏర్పాటుచేసి, పట్టణ, గ్రామస్థాయిలో తలసరి గ్రాంటుల్ని కల్పించాలి. వీటి కోసం అవసరమైతే రాజ్యాంగం 371 అధికరణాన్ని సవరించాలి''. తుదిదశలో అందరికీ ఆమోదయోగ్యంగా ఎటువంటి పరిష్కారం కుదురుతుందో దానికి తగ్గట్టు రాష్ట్రంలో ఏర్పాట్లు జరిగేందుకు రాజ్యాంగపరంగా కావలసిన మార్పుల్ని చేయాలి. రాష్ట్రంలో పరిణామాలు ఎంతో కీలకమైనవి. వాటి ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటుంది. దేశంలో ఎలా ఉన్నా ఈ సంక్షోభాన్ని రాష్ట్రంలో ఒక అవకాశంగా తీసుకుని వ్యవస్థీకృతంగా మంచిమార్పులు తెచ్చేందుకు కృషిచేయాల్సి వుంది.

**అన్ని ప్రాంతాల ప్రయోజనాల పరిరక్షణకు, అందరికీ ఎదిగే అవకాశాలకూ లోక్‌సత్తా కట్టుబడి ఉంటుంది**

రాష్ట్రం విడిపోయినా లేక సమైక్యంగా ఉన్నా... మనందరం ఒకే గడ్డ మీద ఒకే భాష మాట్లాడుతూ పరస్పర గౌరవంతో కలిసికట్టుగా జీవించాల్సి ఉంటుంది. ఏ ప్రాంతంయొక్క ప్రయోజనాలను కాపాడటంలోనూ లోక్‌సత్తా రాజీపడదు. అందరికీ న్యాయం అందించే లక్ష్యసాధనకు పోరాటం సాగిస్తుంది.

'అన్ని వర్గాలలో చర్చలు జరిపి అందరికి ఆమోదయోగ్యమైన పరిష్కారం సాధించాలని తొమ్మిదేళ్లు నుంచి మేం చెబుతున్నాం. అందుకే మేం ప్రత్యేక తెలంగాణ కానీ, సమైక్యాంధ్ర ఉద్యమంలో కానీ పాల్గొనడంలేదు. వీటిని దృష్టిలో ఉంచుకొని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేయాలి. తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం మంటలు ఎగదోయడం, విద్వేషాలు సృష్టించడం మంచిదికాదు. ఇది దేశ, ఆర్థిక భవిష్యత్తుకు తీవ్ర ప్రతిఘాతమవుతుంది". రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియ ఆరోగ్యకరంగా చేసుకోవాలి. తప్పితే విద్వేషాలు రెచ్చగొట్టి కాదు.

యువత, విద్యార్థులు తమ సమయాన్ని హింస, విద్వేషాల్లో వృధాచేయకుండా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాల తీరును మార్చటానికి కలిసికట్టుగా కృషిచేయాలి. దశాబ్దాల తరబడి రాజకీయపార్టీల ఎడతెగని అవినీతి, బంధుప్రీతి, నిర్లక్ష్యం వల్ల కోట్లాది ప్రజలు యాచకుల్లా దుర్భర జీవితం గడుపుతున్నారు. పార్టీలు ప్రజల్నేకాక, నమ్ముకున్న నేతల్ని సైతం మోసం చేశాయి. "దేశం కోసం ఆరాటపడేవారంతా ఏ పార్టీలో ఉన్నా ఇప్పటికైనా మేలుకోవాలి. రాజకీయాల్ని ప్రక్షాళన చేసి పునరేకీకరణకు ముందుకు రావాలి. రాష్ట్రంతో మొదలుపెట్టి, దేశవ్యాప్తంగా రాజకీయాల్ని మార్చుకునేందుకు నేతలు, ప్రజలు నడుంబిగించాలి" ★

# ఆర్థిక మాంద్యంలో ప్రపంచం - హాని చేస్తున్న అవినీతి

## ప్రపంచ దేశాలగుట్టు విప్పిన ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సూచిక - 2009

ఆర్థిక మాంద్యం నుండి ప్రపంచంలో పలు దేశాలు ఇప్పుడిప్పుడే కోలుకోవడం మొదలుపెట్టాయి. ఈ దేశాల పాలిట అవినీతి హానికరంగా పరిణమించింది. కొన్ని దేశాలు అస్థిరత్వంలో ఉన్నాయి. నిరంతర సంఘర్షణలతో వున్నాయి. అలాంటి దేశాలకు అవినీతి మహమ్మారి ఒక సవాలుగా పరిణమించింది.

ప్రపంచంలో 180 దేశాలలో ప్రభుత్వ రంగాలలో, స్థానిక వ్యవస్థలలో వున్న అవినీతి స్థితిని అంచనా వేసి ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ విడుదల చేసిన సూచిక ఈ పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈ సూచికలో '0' స్కోరు అత్యంత అవినీతిని, 10 పాయింట్ల స్కోరు అతి తక్కువ అవినీతిని సూచిస్తుంది. వివిధ దేశాలు సాధించిన స్కోరు ఆధారంగా అవినీతిలో ఈ దేశాల స్థానాన్ని "ర్యాంకు" గా ప్రకటించడం జరిగింది.

నిరంతరం సంఘర్షణలతో దుర్బలంగా వున్న దేశాలు ఈ సూచికలో అతి తక్కువ స్కోరుతో అవినీతిలో ముందున్నాయి. సోమాలియా 1.1, ఆఫ్ఘనిస్తాన్ 1.3, మయన్మార్ 1.4, సూడాన్ ఇరాక్ దేశాలు సమానంగా 1.5 పాయింట్ల స్కోరుతో వున్నాయి. ఈ దేశాలు నిరంతరం అస్థిరత్వంతో, అస్తవ్యస్థమైన పరిపాలనా సంస్థలతో అత్యంత అవినీతికరమైన దేశాలుగా నమోదు అయ్యాయి. ఏ దేశంలోనైనా అవినీతిని నిరోధించడానికి అవసరమైన కీలక వ్యవస్థలు లేనప్పుడు లేదా బలహీనపడినప్పుడు అవినీతి అదుపు తప్పుతుంది. ప్రజల సొత్తును తిరిగి తిరిగి దోచుకుంటూ మరింత అస్థిరత్వం చోటు చేసుకుంటుంది. అవినీతి విచ్చలవిడిగా వున్నప్పుడు ప్రభుత్వాల పట్ల, వివిధ వ్యవస్థల పట్ల ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుంది. ఇది అస్థిరత్వాన్ని మరింత పెంచుతుంది.

అవినీతి సూచికలో అత్యంత తక్కువ స్కోరు సాధించిన దేశాలలో ప్రభుత్వ వ్యవస్థల్ని, పాలనా సంస్థల్ని మరింత పటిష్టం చెయ్యడం మీద దృష్టి పెట్టాలి. అవినీతిని అదుపు చెయ్యాలంటే దేగకన్ను వెయ్యగల పార్లమెంటరీ వ్యవస్థలు, సమర్థత గల న్యాయవ్యవస్థ, స్వతంత్ర ప్రతిపత్తి గల ఆడిట్ వ్యవస్థ, అవినీతి నిరోధక వ్యవస్థలు వుండాలి. బడ్జెట్లు, ఆదాయాలు, విదేశీ సహాయం వగైరాలు పారదర్శకంగా, జవాబుదారీతనం గలవిగా వుండాలి. మీడియా స్వేచ్ఛ, స్పందించే పౌరసమాజ సంస్థలు వుండాలి.

ఈ సూచిక ప్రకారం భారతదేశం 3.4 స్కోరుతో 84 నుండి 88 స్థానాలలో ఉంది. అత్యున్నత స్కోరు చేసిన దేశాలుగా న్యూజిలాండ్ 9.4, డెన్మార్క్ 9.3, సింగపూర్, స్వీడన్ దేశాలు 9.2, స్విడ్జర్లాండ్ 9.0 పాయింట్లతో వున్నాయి. ఈ దేశాలలో వున్న రాజకీయ స్థిరత్వం, స్థిరపడ్డ చట్టబద్ధ పాలనా వ్యవస్థలు, దృఢంగా వున్న ప్రభుత్వ వ్యవస్థల వల్ల సాధ్యపడింది.

పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన దేశాలలో కూడా అవినీతి పట్ల ఏమరుపాటు తగదని గుర్తుంచుకోవాలి. అభివృద్ధి చెందిన దేశాలలో వున్న కంపెనీలు లంచాలను అందించే కేంద్రాలుగా చేతులు మారడానికి దోహదకారులుగా వుంటున్నాయి. అలాగే ఆర్థిక రహస్యాల వెల్లడి సాధ్యం కాదనే పేరుతో వివిధ దేశాలలో అవినీతితో కొల్లగొట్టిన సొమ్ము ఆయా దేశాల సరిహద్దులు దాటిపోతున్నది. అవినీతిని అరికట్టడానికి ఆయా దేశాలు తమ సొత్తును వెనక్కి తరలించుకోవడానికి ఆటంకం అవుతున్నది.

అవినీతి సొమ్ముకి ప్రపంచంలో ఎక్కడా ఆశ్రయం ఇచ్చే స్థావరాలు వుండకూడదు. దీనికి ఏవేవో కుంటిసాకులు చూపించే ప్రయత్నాలకు వెంటనే స్వస్తి చెప్పాలి. లంచాలు, కార్టెల్స్, ఇతర అవినీతికర పద్ధతులు ప్రపంచంలో అన్ని దేశాలకు ప్రత్యేకించి అత్యంత పేదరికంలో వున్న దేశాల వనరులను కొలగొట్టి ఆ దేశాల అభివృద్ధిని వమ్ము చేస్తున్నాయి.

1990-2005 మధ్యకాలంలో 283 అంతర్జాతీయ ప్రైవేటు కార్టెల్స్ గుత్తగా ఛార్జీలు పెంచడం ద్వారా ప్రపంచంలోని వినియోగదారులు 300 బిలియన్ డాలర్లు నష్టపోయారు. 2009 అవినీతిస్థితి సూచికలో అత్యధిక దేశాలు 5 పాయింట్ల స్కోరుకు దిగువనే ఉన్నాయి. అంటే ఈ దేశాలన్నింటికీ అవినీతి ఒక పెద్ద సవాలు అని నేరుగా చెప్పనక్కరలేదు.

ప్రపంచంలో గాని, జాతీయస్థాయిలో గానీ ఎక్కడైతే అవినీతి మీద నిఘా సంస్థలు, చట్టబద్ధ వ్యవస్థలు పటిష్టంగా, క్రియాశీలంగా వున్నాయో అక్కడ అవినీతి తక్కువస్థాయిలో వుంటున్నది. ఇది ప్రభుత్వ సంస్థల మీద, వ్యవస్థల మీద ప్రజల విశ్వాసాన్ని పెంచుతుంది. అయితే తక్కువ స్కోరు చేసిన దేశాలలో ఇలాంటి పరిస్థితిని నెలకొల్పగలిగితే అత్యంత ఈతి బాధలు అనుభవిస్తున్న ప్రజల వాటి నుండి విముక్తం అవుతారు.

(డిసెంబరు 1-15, 2009 'జాతీయస్ఫూర్తి' సౌజన్యంతో) ★

## పన్నులకు తగ్గ సేవల కోసం... అవినీతి లేని పాలన కోసం....

# మున్సిపాలిటీలలో పౌరులు కేంద్రంగా పాలన సురాజ్య ఉద్యమ లక్ష్యం

నగరాలు, పట్టణాలు నాగరికతకు చిహ్నాలుగా వుండాలి. ఉన్నతస్థాయి జీవనానికి, ఉత్తమ ప్రమాణాల సేవలకు పట్టుకొమ్మలుగా వుండాలి. కాని మన రాజకీయం నగర జీవనాన్ని నరకప్రాయం చేసింది. మున్సిపాలిటీలను మురికికూపాలను చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రభువులుగా చలామణీ కావల్సిన ప్రజల్ని ప్రతి చిన్న పనికి ఆఫీసుల చుట్టూ తిరిగి బతిమాలి లేదా చేయి తడిపి తెచ్చుకునే యాచకుల్ని చేసింది. మన ఓటుతో అధికారంలోకి వచ్చేవాళ్లు ఎవరైనా వారు సేవకులుగా వుండాలి. మనం కట్టే పన్నులకు తగ్గ సేవలు మనకు అంది తీరాలి. అవినీతి లేని పాలనను ప్రజలు పొంది తీరాలి. అందుకోసం జరుగుతున్న కృషిలో మనందరం భాగస్వాములు కావాలి.

### 1. ప్రజల ఎజెండాను రూపొందిద్దాం

- తాగడానికి పనికొచ్చే మంచినీరు అందించడం మున్సిపాలిటీ విధి. కానీ ఎక్కడా శుద్ధి చేసిన మంచినీటికి గ్యారంటీ లేదు. పేదలు, సామాన్యులు ఈ నీళ్లే తాగి రోగాలు తెచ్చుకుంటున్నారు. ఒక పక్క మంచినీటికి పన్ను కడుతూనే మరో పక్క చాలామంది నెలకు రూ॥ 1000/- డబ్బా మంచినీళ్లకు ఖర్చుపెడుతున్నారు.

- మెరుగైన పారిశుద్ధ్యాన్ని అందించడం మున్సిపాలిటీ విధి. మురికికాల్వల నిర్వహణలో, చెత్తా చెదారం తొలగింపులో అలసత్వానికి పట్టణాలన్నీ అనారోగ్యం పాలౌతున్నాయి. దోమల వీరవిహారం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. పేదలు, సామాన్యులు ఈ దోమలతో సహజీవనం చేస్తూ రోగాల పాలవుతున్నారు. మరొక పక్క మధ్యతరగతి ఈ దోమల పీడ వదిలించుకోడానికి ప్రతినెలా రూ॥ 100 నుండి 150 రూపాయలు వరకు కాయిల్స్‌మీద, మ్యాట్స్‌మీద జేబులోంచి ఖర్చు చేస్తున్నారు.

- రోడ్లు, వీధి దీపాల నిర్వహణ మున్సిపాలిటీ బాధ్యత కాని ప్రతి పట్టణంలో అనేక ప్రాంతాలు చీకట్లోనే వుంటున్నాయి. గోతులు, గుంటల రోడ్లతోనే వుంటున్నాయి. కొత్త కాలనీలలో పరిస్థితులు దుర్భరంగా వున్నాయి. ఈ చీకటిలో దొంగలు ఘరానాగా సంచరిస్తున్నారు. యజమానులు దొంగల్లా ఇళ్లు చేరుతున్నారు.
- ఇవి కాకుండా ఇంకా మున్సిపల్ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వగైరాలు... సమస్యలతో సతమతమౌతున్నాయి. మెరుగైన సేవల కోసం ప్రజలు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. వీటికి తోడు ట్రాఫిక్ సమస్యలు, కాలుష్య సమస్యలు వుండనే వున్నాయి.

ప్రతి సమస్యకీ పరిష్కారం వుంది. ప్రతి పట్టణంలో సమస్యలను నిర్దిష్టంగా అధ్యయనం చెయ్యాలి. పరిష్కారాలను ప్రతిపాదించాలి. నగరాలకు, పట్టణాలకు ప్రజల ఎజెండాను రూపొందించుకుందాం. మెరుగైన సేవల కోసం ఉద్యమిద్దాం.

### 2. ఎక్కడి పనులకు అక్కడే పరిష్కారం - వార్డు కమిటీల ఏర్పాటు

పురపాలన పౌరుల భాగస్వామ్యంతో సాగాలి. మనం నివసించే వీధుల్లో మంచినీటి సరఫరా, చెత్తా చెదారం తొలగింపు, మురికి కాల్వల, వీధిలైట్లు, రోడ్ల మరమ్మతులు స్థానిక పాఠశాల, అంగన్‌వాడీ, పార్కులు తదితర అంశాల నిర్వహణ, ఆజమాయిషీ బాధ్యతలు స్థానిక ప్రజల చేతుల్లో ఉండాలి. ఎక్కడి సమస్యలకు అక్కడే తక్షణం పరిష్కారించే వ్యవస్థ ఉండాలి. ఇలాంటి

"వార్డు కమిటీ"ల ఏర్పాటు కోసం రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలలో వార్డు కమిటీల ఏర్పాటుకు, నిధుల కేటాయింపుకు చట్టం చేసినా అమలు కావడం లేదు. దీనిని తక్షణం అమలులోకి తేవడం మనందరి లక్ష్యం కావాలి.

### 3. సకాలంలో పౌరసేవలు

మున్సిపాలిటీ జారీ చేసే జనన - మరణ ధృవపత్రాలు, ఇంటి ప్లాన్ మంజూరు, మంచినీటి కుళాయి, కొత్త ఇంటికి నెంబరు, ఆస్తి పన్ను వివరాలు వంటి సేవలకు సిటిజన్స్ ఛార్టర్లు వున్నాయి. గడువులోగా వాటిని జారీ చెయ్యకపోతే రోజుకి 100 రూపాయలు దరఖాస్తుదారునికి పరిహారం చెల్లించే ఏర్పాటు వుంది. కాని ఎక్కడా సకాలంలో సేవలు అందడం లేదు. ఈ సేవలను విస్తృత పర్చాలి. అలాగే రోజువారీ ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చెయ్యాలి.

### 4. అవినీతి లేని పాలన అందాలి

దేశంలో, రాష్ట్రంలో, పట్టణాలలో మన రాజకీయం అవినీతికి నిలయం అయింది. ఎన్నికల్లో ఓట్లు కొనడానికి మద్యం పంపిణీకి కోట్లు పెట్టుబడి పెట్టడం తిరిగి కోట్లు దండుకునే రాజకీయం అన్ని స్థాయిల్లో వచ్చింది. అందుకే రోడ్లు, డ్రైనులు వగైరా... సకల కాంట్రాక్టులలో, పారిశుధ్య కాంట్రాక్టులలో, ఇతర మున్సిపల్ కార్యకలాపాలలో రాజకీయం అండతోనే అవినీతి అంతా సాగిపోతున్నది. ఈ రాజకీయాన్ని వదిలించుకోవాలి. మున్సిపాలిటీలలో సుపరిపాలన సాధించుకోవాలి.

**పన్నులకు తగ్గ సేవలు మనం పొందాలి**

**అవినీతి లేని పాలన మనకు అందాలి**

**ప్రతి వార్డుకీ స్థానిక ప్రభుత్వం**

**ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం**

(గౌ॥ శ్రీ డి.వి.వి.యస్. వర్మగారు రాసిన
'సురాజ్య ఉద్యమం' పుస్తకం నుండి)




కార్టూన్ - లక్ష్మణ్

" మీకు సహాయం కావాలంటే - నిర్దేశించిన ఫారంలో దరఖాస్తు పెట్టాలి. మూడు కాపీలు పంపాలి. ఇద్దరు సాక్షుల సంతకాలు, గెజిటెడ్ ఆఫీసరు కావాలి. రిజిష్టరు పోస్టులో పంపాలి".

## ప్రతిజ్ఞ

**సురాజ్యం కోసం సాగిస్తున్న మరో స్వతంత్ర పోరాటంలో**

**నేను భాగస్వామిగా ఉంటాను - స్వతంత్ర యోధుల త్యాగఫలాన్ని,**

**రాజ్యాంగ విలువలని రక్షించుకోవడం కోసం,**

**అవినీతిని అంతం చేయడం కోసం నాసర్వ శక్తుల్ని ఒడ్డుతాను**

**కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా**

**దేశ ఐక్యతని, సమగ్రతని నిరంతరం కాపాడుతాను**

**దేశ నిర్మాణ కార్యక్రమంలో నేను విధిగా పాల్గొంటాను**

**ప్రజాస్వామ్యంలో సురాజ్యం నా జన్మహక్కు**

**దానిని సాధించడం నా విధిగా భావించి ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను**

# కొత్త రాజకీయం - కేశవరంలో లోక్‌సత్తా చూపిన మార్గం...

## సంకల్పం ఉంటే ఎంత వేగంగా అభివృద్ధిని సాధించవచ్చో కళ్లెదుటే సాక్ష్యం

శంకుస్థాపనలకే అభివృద్ధి పరిమితం కావటం ఆనవాయితీగా మారిన ప్రస్తుత రాజకీయాల్లో లోక్‌సత్తా పార్టీ కేవలం నెలరోజుల వ్యవధిలో పాఠశాల గదుల నిర్మాణాన్ని పూర్తిచేసి సంప్రదాయ పార్టీల పాతరాజకీయానికి పెనుసవాలు విసిరింది. ఇటీవలి వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న మహబూబ్‌నగర్ జిల్లా అయిజ మండలంలోని కేశవరం గ్రామాన్ని దత్తత తీసుకుని పునర్నిర్మించే బాధ్యతలు తీసుకున్న లోక్‌సత్తా పార్టీ... అక్కడ తన కృషిని ఒక స్థాయికి తీసుకొచ్చి గ్రామానికి ఓ కొత్తరూపును, అభివృద్ధికి అనువైన ఓ కొత్త వాతావరణాన్ని సాధించింది.

వరద దెబ్బతిన్న మిగిలిన ప్రాంతాల్లో లక్షల ఇళ్లు కట్టించిఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇంతవరకూ ఒక్క ఇటుకను కూడా పేర్చలేకపోయింది. ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాల కంటే కూడా లోక్‌సత్తా చాలా వేగంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసింది. "2000 మంది జనాభా, 400 ఇళ్లు వున్న ఈ గ్రామం వరదలతో పూర్తిగా దెబ్బతింది. సుమారు 400 ఎకరాల వ్యవసాయభూమి ఇసుకమేట వేసి సర్వనాశనమైంది. మరో 400 ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతింది. లోక్‌సత్తా బృందం ఆ గ్రామానికి వెళ్ళేసరికి ప్రజలు ఆకలి, తీవ్ర నిర్వేదంతో అత్యంత దైన్య పరిస్థితుల్లో, ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మళ్ళీ కోలుకోలేనంతగా దెబ్బతిన్న కేశవరం గ్రామాన్ని దత్తత తీసుకున్న నెలరోజుల వ్యవధిలో లోక్‌సత్తా అక్కడ గ్రామ పునర్నిర్మాణానికి స్పష్టమైన చర్యలు తీసుకుంది. పారిశుధ్యం, కనీసావసరాలు, వ్యవసాయం, విద్య, ఉపాధి అంశాలపై కీలకంగా దృష్టిపెట్టిన లోక్‌సత్తా బృందం గ్రామంలోని అన్ని సమస్యల గురించి కలెక్టర్‌కు సమగ్రమైన నివేదికను సమర్పించి సహాయచర్యల అమలు ప్రారంభించింది. గతంలో నాలుగు గదులున్న పాఠశాల భవనానికి అదనంగా మరో మూడు అదనపు గదుల్ని నిర్మించింది. ఎల్‌సీఎం ఇండియా కంపెనీ రూపొందించిన లైట్‌వెయిట్ నిర్మాణం పద్ధతి(ఎల్‌సిఎమ్)లో దాతలిచ్చిన విరాళాల నుంచి మూడు లక్షల రూపాయల ఖర్చుతో కేవలం నెలరోజుల్లో నిర్మాణం పూర్తిచేసి, నవంబర్ 21న ప్రారంభోత్సవం చేసింది.

### గ్రామస్తుల్లో చైతన్యం తెచ్చి బెల్టుషాపుల తొలగింపు

లోక్‌సత్తా ఫ్లడ్‌టీమ్ ఇన్‌ఛార్జి జి.వి రాఘవరాజు నెలరోజులుగా కేశవరంలోనే మకాంవేసి నిర్మాణం పనులు పర్యవేక్షించటంతోపాటు గ్రామస్తులకు మద్యంవల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి స్థానికంగా వున్న ఐదు బెల్టుషాపుల్ని గ్రామస్తుల సహకారంతో పార్టీ బృందం తొలగించి ఈవేళ అక్కడి కుటుంబాలు ప్రశాంతంగా జీవిస్తున్నాయి. మద్యనిషేధం పూర్తిగా అమలుకావడంతో మద్యం అలవాటున్న 80 శాతం మంది గ్రామస్తులు కూడా మద్యానికి దూరమయ్యారు. అలాగే హెచ్చువడ్డీలకు సూక్ష్మరుణాలను తీసుకుంటూ నలిగిపోతున్న మహిళలకు 3శాతం వడ్డీరేటుకు బ్యాంకురుణాలు తీసుకోవటంపై అవగాహన కల్పించారు. విద్యుత్‌శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించటంతోపాటు కొత్తగా 7 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు. చైతన్యవంతులైన స్థానికులు ఇప్పుడు అధికారుల్ని నిలదీసి తమ పనులు పూర్తిచేయించుకోగలుగుతున్నారు. మరోవైపు జిల్లాలో పనిచేస్తున్న కొన్ని స్వచ్ఛందసంస్థల సహకారంతో వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం లోక్‌సత్తా కృషి ప్రారంభించింది.

### గ్రామంలో ఇప్పుడు కుల,మతాలకతీతమైన ప్రశాంత సహజీవనం

ఓట్ల కోసం ప్రజల మధ్య చిచ్చుపెట్టకుండా అభివృద్ధి చేయాలన్న రాజకీయ సంకల్పం, నిర్దిష్ట విధానాలు ఉంటే అభివృద్ధి ఎంత త్వరితగతిన సాధ్యమో కేశవరం ఓ ఉదాహరణ

"లోక్‌సత్తా గ్రామంలోకి అడుగుపెట్టినరోజున ప్రజలలో వ్యవస్థ మీద చాలా ద్వేషం ఉండేది. వరద సహాయ చర్యలు మా కులం వారికిస్తారా, ఆ కులంవారికిస్తారా, ఆ ప్రాంతంవారికిస్తారా, ఈ ప్రాంతంవారికిస్తారా అని బహిరంగంగానే విద్వేషపూరితరీతిలో అడుగుతూ సహాయం కోసం ఆత్మగౌరవం చంపుకుని చేయిచాచి అడుగుతుండేవారు. కానీ అందరికీ ఆత్మగౌరవం, ఎదిగే అవకాశాలు మౌలికవిధానంగా కలిగిన లోక్‌సత్తా వరద సాయాన్ని బిచ్చం వేసినట్టుకాకుండా, ప్రతి ఇంటికీ స్వయంగా తీసుకెళ్లి గౌరవంగా అందచేసింది. సమస్యల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసే పనిలో ఊరందరినీ భాగస్వాముల్ని చేసింది. అలాగే వారి భాగస్వామ్యంతో పునర్నిర్మాణ కార్యక్రమాన్నీ ప్రారంభించింది. దీనివల్ల ఈరోజు ఆ గ్రామంలో కుల,మత భావాలకు అతీతంగా అందరూ ప్రశాంతంగా జీవిస్తూ అభివృద్ధివైపు ఆత్మవిశ్వాసంతో చూస్తున్నారు" గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు లోక్‌సత్తా ఇదేతీరుగా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుంది.

**అధికారంలో లేకుండానే ఇంత చేయగలిగాం...**
**ఇన్నాళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ సరిగ్గా వ్యవహరించి ఉంటే!?**

అధికారం లేకుండానే లోక్‌సత్తా ఆ విజయాన్ని సాధించి చూపిందని, కానీ గత 50ఏళ్లకు పైగా రాష్ట్రాన్ని పాలిస్తూ వస్తున్న కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు ప్రతిపైసానూ సద్వినియోగం చేసి ఉంటే రాష్ట్రంలో ప్రతి ఊరూ అభివృద్ధికి నిలయంగా మారి వుండేది.. అభివృద్ధి పేరిట ఏటా వేలకోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నా ప్రతి ప్రాంతంలో కొంతమందికే ప్రయోజనం, మిగిలినవారి జీవితం నానాటికీ దుర్భరంగా మారుతున్నాయి, కులం, మతం పేరుతో చిచ్చు, విచ్చలవిడి మద్యం జీవితాల్ని నాశనం చేస్తున్నాయి. దశాబ్దాలపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఇప్పటికీ వార్డుల్లో నల్లాల సమస్యల గురించి, రక్షిత మంచినీరు గురించి వివరాలు అడుగుతున్నాయంటే, వారు చేసిన అభివృద్ధి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవుతుంది. అందరికీ ఎదిగే అవకాశాలతోపాటు, ప్రజలకే అధికారాన్నివ్వటం ద్వారా లోక్‌సత్తా పార్టీ ప్రజా జీవితాలని అత్యుత్తమ జీవనయోగ్యంగా తీర్చిదిద్దుతుంది. దీన్నో నమూనాగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తుంది. ★





# జేపీ అభివృద్ధి పనుల జాబితా ఇదిగో...

వి. విజయేందర్ రెడ్డి

డబ్బు, మద్యం పంచకుండా ఎన్నికల్లో పాల్గొనే లోక్‌సత్తా కొత్త రాజకీయసంస్కృతిని భరించలేకే తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై పూర్తి నిరాధార, అసత్య ఆరోపణలు టీడీపీ అధ్యక్షుడు విశ్వసనీయతను కోల్పోయారనటానికి కూకట్‌పల్లిలో జేపీపై గత నవంబరు నెలలో చేసిన వ్యాఖ్యలు స్పష్టమైన నిదర్శనం. యువత, మధ్యతరగతి నుంచి లోక్‌సత్తాకు లభిస్తున్న ఆదరణను చూసి ఓర్చుకోలేని చంద్రబాబు కూకట్‌పల్లిలో జేపీపై విశంకక్కుతూ ప్రసంగించారు. జేపీ లాంటి మంచి విషయపరిజ్ఞానం, విశ్లేషణాశక్తి ఉన్న వ్యక్తి టీవీ యాంకర్‌గా తప్ప రాజకీయనాయకుడిగా పనికిరాడని చంద్రబాబు అన్నారు. అవగాహనలేనివారు, దోపిడీదారులే రాజకీయాల్లో ఉండాలని చంద్రబాబు భావిస్తున్నట్టుంది. అందుకే కొత్త రాజకీయం వద్దు, దోపిడీ రాజకీయమే ముద్దు అన్నట్టు చెబుతున్నారు. డబ్బు, మద్యం లేకుండా కేవలం విలువలకు, విధానాలకు ప్రాధాన్యతనిచ్చి జేపీని గెలిపించిన కూకట్‌పల్లి నియోజకవర్గానికి రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ఉన్న విశిష్టత దృష్ట్యా కూడా వాస్తవాలు ప్రజలకు తెలియాలి.

శాసనసభకు ఎన్నికలు పూర్తయిన వెంటనే గెలుపు ఓటమిలతో సంబంధంలేకుండానే జేపీ కూకట్‌పల్లిలోని అన్ని ప్రాంతాలనూ పర్యటించి ప్రజలకు ధన్యవాదాలు చెప్పటంతోపాటు స్థానిక సమస్యలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికలు, రాజకీయాలంటే కేవలం అధికారం కోసమే అని భావిస్తూ ఏరు దాటాక తెప్పతగలేసే చంద్రబాబు నాయుడు అందరూ తనలాగే ఉంటారని ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేసారు. “ఎన్నికలయ్యాక గెలుపుతో సంబంధంలేకుండా పర్యటించిన తొలి నేత అని ప్రజలు ఆశ్చర్యంతో వ్యాఖ్యానించినట్టు ప్రముఖ పత్రికల్లో సైతం కథనాలు వచ్చాయి. ఫలితాలు వెలువడి జూన్ 1వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తేది:1-6-2009 నుండి 13-11-2009 వరకు 167రోజుల్లో 55సార్లు కూకట్‌పల్లిలో పర్యటించారు. ప్రతి శనివారం వ్యక్తిగతంగా కూకట్‌పల్లిలో అందుబాటులో ఉండటంతోపాటు, ప్రతిరోజూ ప్రజల సమస్యలను తీసుకునేందుకు కాల్‌సెంటర్‌ని ఏర్పాటుచేసి, వాటి పరిష్కారానికి నిర్దిష్టకాలవ్యవధిని తెలియచేస్తున్నారు. “కొన్ని సమస్యల్ని తక్షణం, కొన్ని ఏడాదిలో, కొన్ని 3ఏళ్లలో, మొత్తం 5 ఏళ్లలో పరిష్కరించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. లోక్‌సత్తా తాత్కాలిక తాయిలాలిచ్చే పార్టీ కాదు, ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారాన్ని చూపుతుంది కాబట్టి అన్ని సమస్యలూ ఒక క్రమపద్ధతిలో పరిష్కారమవుతాయి” దాంతోపాటు... అసెంబ్లీలో గళం విప్పటం ద్వారా జేపీ... ప్రభుత్వం చేపట్టదలచిన సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టంలో రాజ్యాంగవిరుద్ధ మార్పులను తీవ్రంగా ఎదిరించి అడ్డుకున్నారు. ప్రతిపక్షాలను ఒకతాటి మీదకు తేగలిగారు. అలాగే విద్యుత్ సంక్షోభంపై, అవినీతి నిరోధక బిల్లు రూపకల్పనలో, దళిత క్రైస్తవుల రిజర్వేషన్ విషయంలో, భారీ ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా చేసే జలయజ్ఞం రాష్ట్రానికి ఉరితాడు ఎలా అవుతుందో అసెంబ్లీలో హేతుబద్ధంగా వివరించారు. వ్యక్తిగత దూషణలు లేకుండా హేతుబద్ధంగా జేపీ చేసిన వాదనలకు యావత్ రాష్ట్రం ఇచ్చే అభినందనలన్నీ కూకట్‌పల్లి ఓటర్లకే చెందుతాయి.

డా॥ జేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ శాసనసభ్యునిగా బాధ్యతలు చేపట్టిన తేది: 01-06-2009 నుండి తేది: 13-11-2009 వరకు నియోజక వర్గంలో చేపట్టిన ప్రధాన కార్యక్రమాల వివరాలు.

**పరిష్కరించిన తక్షణ సమస్యలు**

1. ‘ప్రజలతో ముఖాముఖి’ కార్యక్రమాన్ని ఐమాక్స్ గార్డెన్ రోడ్ నెం. 4లో నాలుగు సార్లు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారు.
2. 99 మంచినీటి నమూనాలను తీసుకొని వాటిని పరీక్ష చేయించి, వాటిలో ఉండవలసిన స్థాయిలో క్లోరిన్ శాతం లేదని నిరూపిస్తూ తక్షణ చర్యల కోసం జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు.

3. నియోజకవర్గంలో ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించి కంటి పరీక్షలు మరియు థైరాయిడ్ పరీక్షలు చేయించి, రోగులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందజేశారు.
4. బాలానగర్ కాలనీలో ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి రోగులకు నిపుణులైన ఇద్దరు వైద్యుల సహకారంతో వైద్య సహాయం, మందుల పంపిణీ ఏర్పాటు చేయించారు.
5. సఫ్దర్‌నగర్ వద్ద అండర్ రైల్ బ్రిడ్జి నిర్మాణం అనేక నెలలుగా పూర్తి కాకుండా నిర్లక్ష్యానికి గురైంది. ఈ పనిని డా॥జేపీ చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారు.
6. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కాలనీలలో ప్రజలకు నిత్యావసరమైన నీటివసతి లేని చోట 20 బోర్‌వెల్స్ వేయించారు.
7. వసంత్‌నగర్ నుండి భగత్‌సింగ్‌నగర్ వరకు వర్షాకాలంలో వచ్చే వరదను నియంత్రించడంకోసం వేసిన పైప్‌లైన్ పని 95% పూర్తయి త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది.
8. సత్యనారాయణ స్వామి కాలనీలో అరకొరగా ఉన్న మంచినీటి సరఫరాని మెరుగుపరచటానికి బూస్టర్ పంప్ ఏర్పాటు జరిగింది. త్వరలోనే ప్రారంభం కానుంది.
9. వసంత్‌నగర్ / సత్యనారాయణ కాలనీలలో రహదారి మధ్యలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయటం జరిగింది.
10. పర్వత్‌నగర్ మరియు మోతినగర్ డివిజన్‌లలో మంచినీటి సరఫరా మెరుగుపరిచేందుకు బూస్టర్ పంప్ ఏర్పాటు చేసి ప్రజలకు అనేక సంవత్సరాలుగా ఉన్న మంచినీటి కరువు నివారించటం జరిగింది.

### చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు – నిర్మాణ దశలో ఉన్నవి

1. భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ - 11 కాలనీ / బస్తీలలో రూ॥ 4.40 కోట్ల ఖర్చుతో పనులు ప్రారంభమయ్యాయి. ఇవి దాదాపు రెండు లక్షల మంది ప్రజలు నివసించే బస్తీలు, కాలనీలలో డ్రైయినేజి సమస్యలని పరిష్కరించటానికి, మంచినీటిలో మురుగునీరు కలవకుండా నిరోధించటానికి శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన పనులు. అవి మూడు నెలల్లో (షెడ్యూల్ సమయం:31-12-2009 లోగా) పూర్తి అవుతాయి.
2. మూసాపేట డివిజన్‌లో మంజీర మంచినీటి సరఫరా కోసం 300 ఎమ్.ఎమ్. పైప్‌లైన్ వేయటం జరిగింది. అలాగే కొన్ని మాసాలుగా నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుని ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావటం కోసం 400 ఎమ్.ఎమ్ పైప్‌లైన్ నిర్మాణం ఏర్పాటు కూడా జరిగింది.
3. కూకట్‌పల్లి 9వ ఫేజ్‌లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.
4. కూకట్‌పల్లి 6వ ఫేజ్‌లో కొంత కాలముగా నిలిపి వేయబడిన స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణాలను పూర్తి చేయడానికి ఏర్పాట్లు జరిగాయి.
5. కూకట్‌పల్లి ఫేజ్ రోడ్ నెం.1 లో రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి.
7. ప్రభుత్వము మరియు మున్సిపాలిటిలోని ప్రజల సమస్యల పరిష్కారం కొరకు పౌర సహాయ కేంద్రాల వ్యవస్థ మొదలైంది.
8. కూకట్‌పల్లి సర్కిల్‌లో 56,000 నీటి కనెక్షన్లు (నగరంలో 10శాతం) ఉండగా, కేవలం 9 యం.జి.డి (నగరంలో 5 శాతం) నీరు మాత్రమే అందిస్తున్నారు. కనీసం 16 యం.జి.డి. నీరు అందించాలని జలమండలికి ప్రతిపాదనలు పంపటం జరిగింది. క్రమక్రమంగా 16 యం.జి.డి. నీటి సరఫరాకి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు

1. పాదచారుల కోసం నాలుగు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను జె.ఎన్.టి.యు, కూకట్‌పల్లి, మూసాపేట్, బాలానగర్‌లలో నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపటమైనది.
2. ప్రస్తుతం కూకట్‌పల్లిలో ఉన్న హుడా ట్రక్‌పార్క్‌ను మియాపూర్‌కు తరలించి ఆ స్థలంలో సాంస్కృతిక, వినోద కార్యక్రమాల కోసం ఒక ఆడిటోరియం మరియు ఆదాయం సమకూర్చే వాణిజ్య సముదాయం నిర్మాణం ప్రతిపాదించడమైనది.
3. జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాలలో మూడు సులభ కాంప్లెక్స్‌ల ఏర్పాటు ప్రతిపాదించడమైనది.
4. గతంలో కూకట్‌పల్లి నియోజక వర్గంలో అస్తవ్యస్థంగా ఉన్న మంచినీటి సరఫరా వ్యవస్థ ఇప్పటికే కొంతమేరకు మెరుగుపరచడం జరిగింది. దానిని పూర్తి స్థాయిలో మెరుగుపంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది.
5. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్‌ను కుంటలు, చెరువుల వద్ద ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు చేయబడ్డాయి.; కుంటలు, చెరువులు ఆక్రమణలకు గురికాకుండా వాటికి ఫెన్సింగ్ ప్రతిపాదించబడింది.
6. మూసాపేట 'వై' జంక్షన్ నుండి మియపూర్ వరకు సర్వీస్ రోడ్ల ఏర్పాటు ద్వారా ఎన్.హెచ్.9 పై వాహనాల రద్దీ తగ్గించడం కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ★



వి. లక్ష్మణ్ బాలాజీ

### వంచనతో ప్రజాభిప్రాయాన్ని మలుస్తున్న

# సంప్రదాయ పార్టీల జిత్తులను ఎదుర్కోవాలి

### - గ్రేటర్ ఫలితాలపై లోక్‌సత్తా పునర్‌నిశ్చయం

చెప్పింది చేసి చూపుతూ ఓ రాజకీయ పార్టీగా చేయగలిగిందంతా చేసినా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవటం మూడేళ్ల లోక్‌సత్తాలో తీవ్ర అంతర్మథనాన్ని రేకెత్తించింది. అవినీతి, అణచివేత, పేదరికాలను శాశ్వతంగా నిర్మూలించేందుకు 'ప్రజలకే అధికారం' మౌలిక సిద్ధాంతంతో, తదనుగుణమైన విధానాలతో వచ్చిన తొలిపార్టీ లోక్‌సత్తా అయితే కొత్త రాజకీయానికి ప్రజల మద్దతు కూడగట్టుకోవటంలో సంప్రదాయపార్టీల నుంచి ఎదురవుతున్న జిత్తులను తట్టుకోవటంలో ఇంకా విఫలమవటం వల్లే జీహెచ్‌ఎంసీలో దెబ్బతిన్నాం.

"సమాజంలో ప్రజాభిప్రాయం లేదా ప్రజల సెంటిమెంట్ అంతిమం అనటంలో ఎటువంటి సందేహం లేదు. ప్రజల సెంటిమెంట్‌తో ఏదీ విఫలం కాదు. అది లేకుండా ఏదీ విజయం సాధించలేదు. అయితే ప్రజల పేదరికాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వంచనతో ప్రజాభిప్రాయాన్ని మలిచే జిత్తులమారి పాతరాజకీయం ఆ పేరుతో విలువల రాజకీయాన్ని దెబ్బతీయాలని చూసింది" చరిత్ర క్రమంలో ఇందుకు ఎన్నో ఉదాహరణలు వంచనతో ప్రజాభిప్రాయాన్ని మలిచి జీసస్ క్రీస్తును శిలువ వేశారు. ఏ ప్రజల కోసం ఆయన జీవించాడో ఆ ప్రజల నోటితోనే చెప్పించి ఆయన్ను బలితీసుకున్నారు.

"రాజద్రోహ నేరం కింద జీసస్‌ను అరెస్టు చేసి ఉరిశిక్ష వేస్తున్న సమయంలో ఆయన్ను పట్టుకున్న రోమన్ గవర్నర్ పాంటియస్ పిలేట్ భార్య ఏ పాపం చేయని జీసస్‌ను వదిలేయమని అడుగుతుంది. మెజారిటీ ప్రజలు చెబితే వదిలేస్తానని పాంటియస్ చెబుతాడు. కానీ తమ అధికారాన్ని దెబ్బతీశాడని జీసస్‌ను ద్వేషించే మత పెద్దలు, పూజారులు జీసస్‌ను కాకుండా ఆయన తోటి ఖైదీ బార్బాస్‌ను వదిలేయమని అడిగేలా జనాన్ని పురిగొల్పుతారు. జీసస్‌ను ఏం చేయాలి అని అడిగితే 'శిలువ వేయండి' అని ప్రజలే అరిచేలా చేస్తారు. ప్రజలు చెప్పారుకాబట్టి జీసస్‌కు ఉరి వేస్తున్నట్టు, తనదేమీ తప్పులేనట్టు పిలేట్ ప్రకటించి చేతులు దులుపుకుంటాడు... సరిగ్గా ఇదే తీరుగా తమ అధికారదాహంతో సంప్రదాయపార్టీలు ఎటువంటి నైతిక విలువలూ లేకుండా వంచనతో ప్రజల్ని రెచ్చగొట్టి ప్రజాభిప్రాయాన్ని మలుస్తున్నాయి. గ్రేటర్ ఎన్నికల్లో అదే జరిగింది. లోక్‌సత్తాపై జరిగిన విషప్రచారాన్ని తిప్పికొట్టటంలో లోక్‌సత్తా పార్టీ అంతగా సఫలం కాకపోవటం వల్లే ఆశించిన విజయం రాలేదు.

పాత రాజకీయం జిత్తుల నుంచి ప్రజల్ని కాపాడి, మంచి రాజకీయం దిశగా ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై, చేపట్టాల్సిన చర్యలపై ప్రధానంగా దృష్టి సారించాలి. ప్రజలకు అధికారాన్నిచ్చే ఈ కొత్త రాజకీయం వచ్చినప్పుడే అవిద్య, అనారోగ్యం, పేదరికం సమస్యల నుంచి ప్రజలు శాశ్వతంగా బైటపడగలుగుతారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రధాన పాత్రను పోషించి, మార్పునకు సూత్రధారులుగా ఉండాల్సిన ప్రజలు ఎన్నికలను కేవలం కొన్ని పార్టీలు లేదా కొందరు రాజకీయనేతల మధ్య పోరాటంగా చూస్తూ సంప్రదాయ పార్టీల ఆటలో పావులుగా చిక్కుకున్నారు. ఈ మార్పు కోసం కృషి చేయాలన్న ఆలోచన కొందరు ఆలోచనాపరులలో ఉన్నా తగినంత సమయం, వనరులు కేటాయించే చొరవ వారిలో కొరవడుతోంది. వీటన్నిటినీ సమన్వయం చేసి సామాన్యుల్ని, సంపన్నుల్ని కొత్త రాజకీయం వైపు నడిపించేలా చర్చ చేసి పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్ళాలి. ★

# లోక్‌సత్తా - పౌరసేవా కేంద్రాలు



డా॥ పి. భాస్కర్ రావు

ప్రజాస్వామ్యంలో సంస్కరణల కోసం ఆచరణాత్మక విధానాలతో ఏర్పాటు చేయనున్న ఈ పౌరసేవా కేంద్రాలలో శాంతిభద్రతలు విద్య, ఆరోగ్యం, రవాణ సౌకర్యాలు వంటి ప్రజల ఉమ్మడి అవసరాలను తీర్చే ప్రభుత్వ సేవలను పొందే విధానాలను, సూచనలను, సలహాను అందిస్తారు. సంఘటిత పరిజ్ఞానంతో పౌరులు ప్రభుత్వాన్ని నిలదీసేలా వారిలో చైతన్యం తీసుకురావడమే కేంద్రాల వెనుక వున్న మౌలిక సూత్రం. ఇంతటి మహత్తర ఉద్ధేశ్యంతో నెలకొల్పబడుతున్న సేవకేంద్రాలు నిరంతరం పనిచేసేలా, ప్రజల ఆదరణ పొందేలా వుండాలంటే ఈ కేంద్రాలలో పనిచేసే వ్యక్తులకు ప్రభుత్వ సేవలపై, పౌరుల హక్కులపై సరైన అవగాహన ఎంతో అవసరం. అంచెలంచెలుగా సేవలను పెంచే ఆలోచనలో వున్న పార్టీ నాయకత్వం ఈ కేంద్రాలలో అనుభవజ్ఞులైన వారిని నియమించాలన్న ప్రయత్నంలో వుంది. లోక్‌సత్తా పార్టీకి మేధావుల, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల, మహిళల, యువత ఆదరణ చాలా వరకు ఉన్నది. అయితే ఈ కేంద్రాలలో పనిచేయడానికి ముందుకు వచ్చేవారికి వేతనాలు ఇచ్చే పరిస్థితిలో లోక్‌సత్తా లేని కారణంగా స్వచ్ఛందంగా పనిచేసేవారిని నియమించుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాసేవ చేయాలన్న ఆశయంతో ముందుకు వచ్చే వారి సేవలు వినియోగించుకోవాలి. పౌరసేవాకేంద్రం ప్రారంభించిన తరువాత ఎట్టి పరిస్థితులలో సేవలకు భంగం కలుగకుండా అన్ని కోణాల నుంచి సాధ్యాసాధ్యాలను పరిశీలించి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. లోక్‌సత్తా పార్టీపై ప్రజలకు ఉన్న విశ్వసనీయత ఈ కేంద్రాల ద్వారా మరింత పెరిగేలా సేవలను విస్తృతపరచాలి.

మొదటిదశలో పౌరసేవాపత్రం ద్వారా పొందగలిగే హక్కు వున్న సేవలను అందించాలి. ధృవీకరణ పత్రాలు, నివాస సర్టిఫికెటు, జననమరణ సర్టిఫికెట్లు, ఆదాయ, కుల, వారసత్వపు ధృవీకరణ పత్రాలు పొందే విధానం పై అవగాహన కల్పించడంతో పాటు అందుకు కావల్సిన దరఖాస్తు ఫారాలు కూడా సేవాకేంద్రాలలో ప్రజలకు అందుబాటులో వుంచాలి. చదువురాని వారికి దరఖాస్తు పత్రాలు పూర్తిచేసి, చెక్‌లిస్టులో ఏయో పత్రాలు జతపరచాలో వివరించాలి. లోక్‌సత్తా పార్టీ ఏర్పాటు చేసిన పౌరసేవా కేంద్రాల నుంచి వచ్చిన దరఖాస్తు పత్రాలను ప్రభుత్వం కార్యాలయాలలో కూడా ఎలాంటి సంకోచం లేకుండా తీసుకునేలా అన్ని సరైన, పూర్తి వివరాలతో పంపించాలి. ఇక రెండవ దశలో సమాచార హక్కు చట్టం గురించిన అవగాహన ప్రజలకు కల్పించాలి. ఈ చట్టం ద్వారా ప్రజలు తమకు అవసరమైన సమాచారం గురించి తెలుసుకునేలా దరఖాస్తులు నింపడం నుంచి వారికి సమాచారం అందేవరకు బాధ్యతను సేవాకేంద్రాలు తీసుకోవాలి. ఇక మూడవ దశలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించిన వివరాలు, ఎలాంటి అర్హతలు కావాలి. ఏ విధంగా ఈ పథకాలను అందుకోవాలన్న పూర్తి సమాచారాన్ని అందించాలి. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, పొదుపు సంఘాల ఏర్పాటు, ఉపాధి కల్పించే పథకాలు, సబ్సిడీరుణాలు తదితర వివరాలను ప్రజలకు అందుబాటులో వుంచాలి. లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను కూడా సమీక్షించి లోపాలు వుంటే ఫిర్యాదు చేయాలి. నైపుణ్యం గల వారికి ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకు రుణాల కోసం సిఫారసు చేయడమే కాకుండా లబ్ధిదారులను గురించి పూర్తి వివరాలు తెలుసుకుని వారు రుణాలను తిరిగి చెల్లించేలా వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలి.

ప్రజలకు బహుళప్రయోజన కారిగా మారనున్న ఈ పౌరసేవాకేంద్రాల ద్వారా వచ్చే సమస్యలను పర్యవేక్షించి ఎలాంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి, వీటికి కారణాలు ఏమిటి? అన్ని కోణంలో కూడా సమీక్షించాలి. ప్రజా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రాల నిర్వహణ ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రభుత్వానికి జవాబుదారీతనాన్ని గుర్తుచేసి స్వరాజ్యాన్ని సాధించాలి. ★



# జిల్లా ప్రభుత్వాల గురించి రాజకీయ నాయకులు తెలుసుకోవాలి

- కటారి శ్రీనివాసరావు

లోక్‌సత్తా పార్టీ చెబుతున్న జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు అసాధ్యమని పేర్కొనటం జిల్లా ప్రభుత్వాల వల్ల రాష్ట్రం 23 ముక్కలైపోతుందని విశాఖపట్నంలో తన ప్రచారపర్యటనలో చేసిన విమర్శల ద్వారా పీఆర్పీ అధ్యక్షుడు చిరంజీవి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై తన అపారమైన అజ్ఞానాన్ని చాటుకున్నారు.

స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, బాధ్యతలను, నిధుల్ని, సిబ్బందిని బదిలీ చేయాలని ఆదేశిస్తున్న రాజ్యాంగంలోని 73, 74వ సవరణలకనుగుణంగానే లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రభుత్వాల కోసం పోరాటం చేస్తోంది. గ్రామస్వరాజ్యం సాధించాలన్న మహాత్మాగాంధీ ఆశయానికి అనుగుణంగానే లోక్‌సత్తా విధానం ఉంది.

ప్రజాస్వామ్యంలో సార్వభౌములైన ప్రజలకు పూర్తిస్థాయి సేవలందించేందుకే పంచాయతీలకు, మండల పరిషత్‌లకు, జిల్లా పరిషత్‌లకు, మున్సిపాలిటీలకు, మున్సిపల్ కార్పొరేషన్లకు సాధికారత కల్పించాలని తొలి నుంచీ లోక్‌సత్తా ఆందోళన చేస్తోంది. ప్రభుత్వాలు ప్రజల కోసం ఉన్నాయి తప్ప ప్రభుత్వాల కోసం ప్రజలు ఉండరు. పీఎం, సీఎం, డీఎం (ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జిల్లా మేజిస్ట్రేట్)ల చేతిలోనే అధికారాల్ని కేంద్రీకరించే కాలం పోయి, స్థానిక స్థాయిలో ఎన్నికైన ప్రభుత్వాలకే అధికారాన్ని అప్పచెప్పే రోజులు రావాలి.

సమైక్యాంధ్రపై లోక్‌సత్తా వైఖరి చెప్పాలని చిరంజీవి చేసిన డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, ఊసరవెల్లిలా రంగులు మార్చిన చిరంజీవిలా కాకుండా సుమారు 10ఏళ్ల నుంచీ ఆ అంశంపై లోక్‌సత్తా స్థిరంగా ఒకే విధానానికి కట్టుబడి వ్యవహరిస్తోంది. లిఖితపూర్వకంగా కూడా అనేకమార్లు ప్రకటించింది. సంప్రదాయపార్టీలు ఒకరోజున రాష్ట్ర విభజనకు మద్దతు పలికి, కేవలం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం రెండోరోజున నిస్సిగ్గుగా వ్యతిరేకించాయి. లోక్‌సత్తా స్టాండ్ లేనట్టు ప్రజల్ని మభ్యపెట్టాలని ఒకపక్క చిరంజీవి చూస్తుంటే, ఢిల్లీ వెళ్లొచ్చాక లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తన స్టాండ్‌ను మార్చారని తెలుగుదేశం నాయకుడు కోడెల శివప్రసాద్ మరోపక్క మాట్లాడారు. పరస్పర విరుద్ధమైన ఆ రెండు ప్రకటనల్నీ చూస్తే కేవలం లోక్‌సత్తా మీద దుష్ప్రచారం చేసి, తమ దగాకోరుతనం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలని సంప్రదాయపార్టీలు ఎన్ని అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయో స్పష్టంగా అర్థమవుతుంది. ఈ దగాకోరు రాజకీయాల్ని మార్చటానికే లోక్‌సత్తా ఉద్యమం రాజకీయ పార్టీగా రూపుదిద్దుకోవాల్సి వచ్చింది. ఈరోజు రాష్ట్రంలో మంటల్ని ఆర్పటానికి లోక్‌సత్తా ప్రయత్నిస్తుంటే, వాటిని ఎలాగైనా ఎగదోయాలని ఆ పార్టీలు విషప్రచారం చేస్తున్నారు. ఏ హోదాలో జేపీ ఢిల్లీ వెళ్లి కేంద్రానికి సలహా ఇస్తున్నారని కాంగ్రెస్ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేసిన విమర్శ సమస్యను పెంచే ధోరణే తప్ప తగ్గించే తీరు కాదు. ఓ పౌరుడిగా సమస్యను పరిష్కరించాలనే బాధ్యతతోనే జేపీ ఢిల్లీ వెళ్లి సామరస్య పరిష్కారానికి కృషి చేశారు.

### ప్రజలకు అధికారాన్నిచ్చేంతవరకూ మార్పు రాదు

"తెలంగాణ ఏర్పాటు మార్గమే తప్ప లక్ష్యం కాదని సంప్రదాయ పార్టీలు గుర్తించాలి. ప్రజలకే అధికారాలనిచ్చి, అవినీతిని తొలగించి, యాదృచ్ఛికంగా ఎవరు ఏ ప్రాంతంలో, ఏ కులంలో పుట్టినా ఎటువంటి వివక్షలేకుండా అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల్ని కల్పించేంతవరకూ ప్రజల జీవితాల్లో మార్పు సాధ్యంకాదు". స్వార్థపూరిత ప్రయోజనాల కోసం ప్రజల్ని రెచ్చగొట్టి అసత్యాలతో నమ్మించేందుకు మోసపూరిత ప్రచారాన్ని రాజకీయపార్టీలు ఇకనైనా ఆపాలి. రాష్ట్రంలో శాంతియుత, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు కలిసిరావాలి. ★



# సామాజిక మార్పు లోక్‌సత్తా పార్టీతోనే సాధ్యం

- ఈద చెన్నయ్య

భారతదేశంలో బహుజనులు తరాల అణచివేతను భరించలేక సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగంలో తమ వాటా, హక్కుల కోసం డా॥ అంబేద్కర్ ఆయన గురువు మహాత్మా ఫూలేలు నాటి పిడివాద బ్రహ్మణీయ వ్యవస్థను, మనువాదాన్ని ఎదిరించి పోరాటాలు చేశారు. ఆత్మగౌరవంతో జీవించడానికి సంపదలో, విద్య. ఉద్యోగం, సామాజిక, రాజకీయం, ఆర్థికరంగాలలో తమ వాటా కావాలని సుదీర్ఘకాలం నుండి పోరాడుతున్నారు. వివక్షతను నుండి ఆత్మవిమర్శ చేసుకొని సాటి మానవునితో సమానంగా జీవించే హక్కు ప్రతి మనిషికి ఉందని మన నాగరిక సమాజానికి తెలియజేశారు. సమైఖ్య భారతదేశంలో దళితులు, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, అభివృద్ధి వంటి అంశాలు దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి. పాలకులు తమ స్వార్ధపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం అవినీతి, దోపిడి, లక్ష్యంగా చేసుకుని అధికారాన్ని కుల ప్రాతిపదికన దశాబ్దాలుగా వంశపారపర్య రాజకీయాలను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు వారి దోపిడీలో భాగస్వాములై తమ సామాజిక వర్గాలకు ద్రోహం చేస్తూ వస్తున్నారు. అందుకే హక్కుల సాధన కోసం దేశవ్యాప్త ఆందోళలనలు ప్రారంభం అవుతున్నాయి. తాము, తమ పిల్లల భవిష్యత్తు తరాలు బానిస బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. హక్కుల పోరాటాల నుండి ఆత్మగౌరవం కోసం ఐక్యత ఉద్యమాల ద్వారా రాజ్యాధికారం కోసం మరో అడుగు ముందుకు వేశారు. దేశంలో రాజకీయంగా బలమైన శక్తిగా ఎదుగుతున్నారు. అణగారిన వర్గాలు రాజకీయ పరిష్కార దిశగా పోరాడుతున్నారు. అందుకే డా॥ అంబేద్కర్ Political Power is the Master Key అన్నారు. దేశవ్యాప్తంగా ఎందరో నాయకులు రాజకీయ పార్టీలను, సంఘాలను స్థాపించి ప్రజలలో చైతన్యం తీసుకువస్తున్నారు. దీనికి ఎందరో భావసారూప్యత గల సామ్యవాదులు, సామాజిక కార్యకర్తలు రాజకీయ పార్టీలు మద్ధతు పలుకుతున్నాయి. దశాబ్దాలుగా అణచివేతకు కారణమైన కులవ్యవస్థ మనల్ని బానిసత్వంలోనికి నెట్టివేసి, సమానంగా జీవించే హక్కును కోల్పోయి, విద్యకు, సంపదకు దూరమై దుర్భర పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. 62 సంవత్సరాల స్వాతంత్ర్యంలో అక్షరాస్యత 15 శాతం కంటే మించలేదు. పాలకులు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, నిర్బంధ విద్య అమలు చేసినా ఫలితాలు రావడం, లేదంటే అర్థం చేసుకోవచ్చు. ఆయా – కులసంఘాలలో ఉన్న విద్యావంతులు, సామాజిక, కార్యకర్తల ముందుగా తమ సామాజిక వర్గాన్ని అభివృద్ధి, చైతన్యపరచుకుంటున్నాయి. ఏకంగా కులసంఘాలు దేశ సమగ్రతకు ముప్పుగా పరిణమించాయనే వాదనలు ప్రజలలో తీసుకువచ్చారు. అందులో ఉన్న కొందరు స్వార్ధపర నాయకులు కులాల చైతన్యాన్ని రాజకీయ లబ్దికోసం సామాజిక న్యాయమంటూ ఎమ్మెల్యే, ఎంపి సీట్లు కేటాయిస్తే సరిపోతుందని తద్వారా వారి రాజకీయ చైతన్యాన్ని మన స్వార్ధ ప్రయోజనాలకు వాడుకోవచ్చనే ఆలోచన బయలుదేరింది. కానీ ఈ సమాజంలో వీరు ఆత్మగౌరవంతో జీవించాలని కానీ, సమాన అవకాశాలు రావాలని కానీ కోరుకోవడం లేదని మనం అర్థం చేసుకోవాలి.

సమైక్య భారతంలో న్యాయం జరగదనే అనుభవం వారిని ఏకం చేస్తుంది తప్ప ఆత్మగౌరవాన్ని పోగొట్టుకొని చేస్తున్న పోరాటాలు కావు. రాజకీయ అనుభవం గల వారికి ఇది స్పష్టంగా అర్థమవుతుంది. దీనికి కారణం రాజకీయం, స్వార్ధం, దోపిడీ నేటికీ వివిధ రాష్ట్రాలలో రెండు, మూడు సామాజిక వర్గాల మధ్యనే అధికారం మారుతూ వస్తోంది. మన రాష్ట్రంలో అగ్రవర్ణాలు రాజకీయాలను కేంద్రంగా చేసుకొని పాలిస్తున్నారు. ఈ మధ్య కాలంలో దళితులు, ఆదివాసీలు కేవలం నోట్లకు ఓట్లు అమ్ముకునే వారిగా, సంక్షేమ పథకాల ద్వారా మభ్యపెట్టవచ్చనే ఆలోచన దీనికి నిదర్శనం. రాజకీయ పార్టీలు ఇటువంటి ధోరణిని మార్చుకోవాలి. ప్రక్షాళన చేయాలి. నేటికి ఇటువంటి వాదనలు చేస్తున్నారంటే రాజకీయ నాయకుల వైఫల్యం, మోసకారి వ్యవహారం బైట పడుతుంది. డా॥ జయప్రకాష్ నారాయణ్ గారు చెప్పినట్లు వివక్షతకు తావులేకుండా అందరికి సమాన విద్య అందాలి. ఎదిగే అవకాశాలు రావాలి. పాలుకులు దేశ ప్రయోజనాలకు పాటుపడాలి. స్వార్ధపూరిత రాజకీయాలకు తావు లేకుండా అవినీతి లేని, స్వార్ధం లేని మంచి రాజకీయాలు రావాలి. పాలనా సంస్కరణలు, తీసుకొచ్చి ప్రతి పౌరునికి న్యాయం జరిగిన రోజున మన పూర్వీకులు, నాయకులు చేసిన త్యాగాలకు అర్థం వుంటుంది. ★

# కదిలిన సంప్రదాయ పార్టీల పునాదులు



- అనుమోలు రాఘవయ్య

హైకోర్టు న్యాయవాది

నవంబరు నెలలో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీకి ఒక సీటు కూడా రాలేదని, లోక్‌సత్తా పార్టీ బలహీనపడినదని అనేకమంది అభిప్రాయపడుచున్నారు. కొన్ని సంప్రదాయ రాజకీయ పార్టీలు ఆనందపడినాయి. కానీ ఇది వాస్తవము కాదు. లోక్‌సత్తాపార్టీ అనేక చోట్ల బి.జె.పి (కేంద్రంలో అధికారం నెరపి రాజధానిలో ముస్లిం మైనారిటీ – వ్యతిరేక పార్టీగా బలపడిన) ప్ర.రా.పా, ఉభయ కమ్యూనిస్టు పార్టీల కన్నా ముందంజలో ఉన్నది.

అన్ని వార్తా పత్రికలలో 'స్పష్టమైన అజెండాలతో' ఎన్నికలలో పోటీ చేసినప్పటికీ అన్ని డివిజన్‌లలో డిపాజిట్లు పోయినవి అని పేర్కొన్నవి. దీనిని బట్టి మున్సిపల్ ఎన్నికల పట్ల పార్టీకి అవగాహన ఉండి స్పష్టమైన ఎజెండాతో వచ్చిన పార్టీగా లోక్‌సత్తా విజయం సాధించింది.

ఇక డిపాజిట్లు కోల్పోవటం విషయానికి వస్తే, కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుచున్న కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన (సంఖ్య) స్థానాలలో 52లో మాత్రమే గెలిచినది. 41 స్థానాలలో డిపాజిట్లు కోల్పోయింది. అంటే 1/3 స్థానంలో మాత్రమే గెలిచినది. 1/3 స్థానాలలో ఓడినది. సుమారుగా 1/3 స్థానాలలో డిపాజిట్లు కోల్పోయింది. అధికారం, ధనము కార్యకర్తల బలము కల 100 సం॥ లపై చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ 1/3 స్థానాలలో డిపాజిట్లు కోల్పోయింది.

ఇక రాష్ట్రంలో 14 సం॥ లు పైగా అధికారంలో ఉండి డివిజన్ల వారీగా బలమైన కార్యకర్తలు కల్గిన ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం కూడా గెలిచింది 43 స్థానాలు మాత్రమే అంటే 1/3 స్థానాల కన్నా తక్కువే. ఆ పార్టీ కూడా 36 స్థానాలలో డిపాజిట్లు కోల్పోయింది. సుమారుగా పోటీ చేసిన 1/3 స్థానాలలో డిపాజిట్లు కోల్పోయింది. గెలిచిన స్థానాలలో మెజారిటీ స్థానాలు రంగారెడ్డి జిల్లా పరిధిలోనివి.

ఉభయ కమ్యునిస్టు పార్టీలు చరిత్ర కల్గినప్పటికి కార్పొరేట్ వ్యతిరేక సిద్ధాంతము గల పార్టీలు, సీట్ల రాజకీయాల వలలో చిక్కుకొని నమ్మిన సిద్ధాంతమునకు విరుద్ధముగా కార్పొరేటు విధానములను బలపరచుచున్న సంప్రదాయ రాజకీయ పార్టీలలో పొత్తులు పెట్టుకొని ఉనికిని కోల్పోయినవి.

ప్రజారాజ్యం పార్టీ సామాజిక న్యాయం అనే చక్కటి విధానముతో ముందుకు వచ్చినప్పటికీ, కాంగ్రెస్, తెలుగుదేశం సంస్కృతిని మించి ధనరాజకీయం చేయుట వలన ప్రజలకు చేరువ కాలేకపోయింది.

సాంప్రదాయ రాజకీయ పార్టీలు నెరుపుతున్న రాజకీయాలు అనగా అధికార, ధన, మద్యంతో ఎన్నికలలో గెలవాలన్న వాటి తీరుకు భిన్నంగా, రాజకీయాల మార్పుకై స్పష్టమైన అజెండా ఉన్న లోక్‌సత్తా పార్టీని ప్రజలు గెలిపించకపోయినప్పటికీ, సాంప్రదాయ రాజకీయ పార్టీల పునాదులు కదిలించే విధంగా తీర్పునిచ్చారు. ఇది హర్షణీయం, శుభపరిణామము.

లోక్‌సత్తా పార్టీ ఆశయం గెలుపు రాజకీయం కాదు.

ప్రస్తుత రాజకీయం తీరు మార్పు ప్రజాస్వామమంటే ఎన్ని సీట్లు గెలుచుకున్నామన్నది ప్రస్తుత రాజకీయం కాని ప్రజాస్వామ్యమంటే స్థానిక స్వపరిపాలన బలోపేతమైన ప్రజల భాగస్వామ్యంతో పరిపాలన.

పై పరిణామం లోక్‌సత్తా పార్టీ ఆశయ సాధనకు కొండంత బలం. ★

**ధన రాజకీయాన్ని వదిలిద్దాం - జన రాజకీయాన్ని సాధిద్దాం**



# లోక్‌సత్తా పార్టీ ఆవశ్యకత

పి.జగన్నాథంనాయుడు

వృక్షో రక్షతి రక్షితః ధర్మో రక్షతి రక్షితః అని మన పెద్దలు పదే పదే చెబుతుంటారు. చెట్లను, ధర్మాన్ని రక్షిస్తే అవి మనల్ని కాపాడుతాయి. అదే విధంగా ప్రజాస్వామ్య రాజకీయాలలో నీతి, నిజాయితీలను, న్యాయాన్ని ధర్మాన్ని పరిరక్షిస్తే అవి తప్పకుండా మన సమాజానికి రక్షణగా నిలుస్తాయనేది "లోక్‌సత్తా పార్టీ" ప్రగాఢ విశ్వాసం అయితే ఇవేవీ పట్టించుకోకుండా పీకల్లోతు అవినీతి బురదలో కూరుకుపోయిన సాంప్రదాయక పార్టీలు మొట్టికాయలు కొట్టి మొగసాలకు ఎక్కినట్టు తిరిగి లోక్‌సత్తా పార్టీపైనే వారి బురద రాజకీయాలు చల్లడానికి ప్రయత్నిస్తున్నాయి. అవినీతి, అక్రమాలు అనేవి చాలా మంది నాయకులకు నేడు శ్వాస-నిశ్వాసాలుగా నిలిచిపోయాయి. వారిని ప్రశ్నించిన వారు ఎంతటి నిజాయితీపరులయినా తిరిగి బురదనంటించడానికి కూడా వెనుకాడనంత నీచస్థాయి రాజకీయాలకు దిగజారిపోతున్నారు. తమలో లేని మంచితనం ఎదుటివారిలో కనిపిస్తే ఉక్రోశాన్ని దాచుకోలేకపోతున్నారు.

అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, అధికారాన్ని అందిస్తే ప్రజలందరూ ఎంతో ఉన్నతంగా జీవిస్తారు. అలా చేయక పోవడం వల్లనే స్వాతంత్ర్యం వచ్చిన 62 ఏళ్ళ తరువాత కూడ కుల, మత, వర్గ, వైషమ్యాలతోనూ ఆర్థిక, తారతమ్యాలతో మనసమాజం తీవ్ర అసమానతలకు లోనయింది. **అందరికీ ఆరోగ్యం-విద్య ఉచితంగా ఉండాలన్నది లోక్‌సత్తా ప్రధాన ఆశయం.**

అయితే వచ్చి అధికారదాహం ఉన్న కలుషిత రాజకీయనేతలు ప్రజలకు మేలుచేయకపోగా మన సమాజాన్ని ప్రాంతం, భాష, కులం, మతం పేరుతో ముక్కలు చేయాలని ఆరాటపడుతున్నారు.

ప్రతి కుటుంబానికీ దక్కాల్సిన లక్షలాది రూపాయల ఆదాయాన్ని దిగమింగి, కొల్లగొట్టి ప్రజలకు నెలవారీగా వెయ్యి, రెండు వేలు ఇస్తామంటూ ఎన్నికలలో సారాయి, బ్రాందీ, డబ్బులు పంచేసి, గెలిచిన తరువాత వారి వారి ఆస్తులను, వ్యాపారాలను పెంచుకొంటూ కోట్లు గడిస్తూ నూటికి 90మందిని స్వతంత్రంగా ఎదగనీయకుండా చేస్తున్నారు. మంచినీరు, మురికికుంటలు, నీరు నిల్వ ఉన్నప్రాంతాలలో ఎప్పటికప్పుడు దోమలు పుట్టి పెరగకుండా మందులు చల్లుతూ ఉండాలి. అందుకు నిధులు మున్సిపాలిటీలకు, పంచాయతీలకు పుష్కలంగా ఉన్నాయి. అయితే ఆ నిధులను కూడా రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు పంచుకుని తినేస్తున్నారు. దాంతో దోమలను, నివారించే పరిస్థితులు లేక గత ఏడెనిమిది సంవత్సరాలుగా ప్రజలు అనేక అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. గత రెండు మూడేళ్ళుగా **చికిన్‌గున్యా, డెంగీలాంటి జబ్బులు పెరగడానికి పంచాయతీలు, మున్సిపాలిటీల అధికార అవినీతి చర్యలే ప్రధాన కారణం. వారి ధన దాహానికి ప్రతి కుటుంబం డాక్టర్లకు ఆసుపత్రులకు 10వేల నుంచి 20వేలు ఖర్చుపెట్టాల్సి వచ్చింది.**

సొమ్ము ప్రజలది, సోకు అవినీతిపరులది అన్నట్టుగా, పెద్దోళ్ళు ఏమి చేసినా జరిగిపోతుందన్నట్టు తయారయింది చట్టం-న్యాయం అనేవి, ఉన్నోడికే పరిమితం అన్నట్టు తయారయింది. చట్టసభలలో నేర చరిత్రులు, రౌడీలు, గూండాలు అవినీతి పరులచే వారి తిట్ల పురాణాలతో సమాజాన్ని రాక్షసరాజ్యంగా మార్చేస్తున్నారు.

ప్రాజెక్టులలో అవినీతి, కాంట్రాక్టులలో అవినీతి ప్రభుత్వసేవలలో అవినీతి అధికారులు, రాజకీయ నాయకులలో అవినీతి పెరిగి నూటికి 90శాతం మంది ప్రజలకు దక్కాల్సిన ఆదాయవనరులను ఆ 10 మంది దోచేస్తున్నారు. ఎన్నికలలో డబ్బులు పెట్టుబడిగా పెట్టి ఓట్లు కొనుగోలు చేసి, కోట్లను ఖర్చు పెట్టడం ద్వారా అంతకు వందరెట్లు అధికారాన్ని అడ్డంపెట్టి నాయకులు దోచుకుంటున్నారు.

పేద, మధ్య తరగతి కుటుంబాలు చేసే ప్రతికొనుగోలు మీద రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలకు ఆదాయం వస్తుంది. ఆ ఆదాయం నూటికి నూరుశాతం ప్రజలకు చెందినవి కాగా పది

శాతం మంది దానిని దోచుకుతింటున్నారు.

మన సొమ్ముతో నడిచే పోలీసుస్టేషన్లు, మండల కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు డబ్బున్న పెద్దోళ్ళ అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతూ పేదలను, రైతులను దోచుకుంటున్నాయి. పుట్టినపుడు మానవులకందరికీ ఒకే శక్తి ఉంటుంది. ఈ ఆర్థిక సామాజిక అంతరాలకు ప్రధానకారణం అందరికీ చదువు లేకపోవడమే. డబ్బు సంపాదనలో తేడాకి చదువు లేకపోవడమే ప్రధాన కారణం.

ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యత్యాసాలకు చదువు లేకపోవడమే మూలకారణం. మనిషి శక్తిని కొన్ని వేలరెట్లను పెంచగలిగేది విద్య మాత్రమే.

నడిచివెళ్ళే వారికి సైకిలుపైన, మోటారుసైకిలుపైన, కారులోను, విమానాలలోను ప్రయాణం చేసేటపుడు వేగంలో ఉన్న తేడా చదువు లేనివారికి ఉన్నవాడికి బతుకువేగంలో ఉన్నతేడాలాంటిదే.

**లోక్‌సత్తా పార్టీ దృష్టిలో ఓటు వేసేది ప్రజలే. అధికారమూ ప్రజలదే. మన ఓటు ద్వారా ఎన్నికయ్యే శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు తమను ఎన్నుకున్నప్రజలకు సేవచేయాలి. కానీ మనదేశంలో అందుకు భిన్నంగా ఉంది. ఓట్లు వేసి గెలిపించడమేగాకుండా, వారికి ప్రజలే సేవ కూడా చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి మన ప్రజాస్వామ్యానిది.**

లోక్‌సత్తా పార్టీ దృష్టిలో ఓటు వేసేది ప్రజలే. అధికారమూ ప్రజలదే. మన ఓటు ద్వారా ఎన్నికయ్యే శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు తమను ఎన్నుకున్న ప్రజలకు సేవచేయాలి. కానీ మనదేశంలో అందుకు భిన్నంగా ఉంది. ఓట్లు వేసి గెలిపించడమేగాకుండా, వారికి ప్రజలే సేవ కూడా చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి మన ప్రజాస్వామ్యానిది. భూముల దురాక్రమణ, చెరువుల కబ్జాలు, గూండాయిజం, అక్రమకాంట్రాక్టులు, అవినీతి పనులు, అక్రమ ప్రాజెక్టులు, అక్రమవ్యాపారాలు ఒకప్పుడు సంఘవ్యతిరేక చర్యలుగా ఉండేవి. అయితే ఇప్పుడు వాటిని ప్రశ్నించిన వారు సంఘవ్యతిరేకులుగా ముద్రవేయబడుతున్నారు. అన్యాయాలను నిలదీసిన మంచివారిపై కేసులు పెడుతున్నారు. రాజ్యాంగ బద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన పోలీసు వ్యవస్థ ఉన్నోడికి ఊడిగం చేస్తోంది.

రాష్ట్రంలో పాతుకుపోయిన రెండు సంప్రదాయక పార్టీలు రాష్ట్రాన్ని ఎవరుదోచుకుతినాలా అని, తినే హక్కుకోసం, తోడేళ్ళలా పోట్లాడుకుంటున్నాయి తప్ప, వారికి బలయిపోతున్న మేకల్లాంటి ప్రజలను, వారికష్టాలను పట్టించుకోవడం లేదు.

తాగేనీరు, తినేతిండి, పీల్చేగాలి, చదువూ, ఆరోగ్యం, ధనికవర్గాలకే పరిమితమై పోతుండగా నూటికి 90మంది అవి ఏవీ దక్కకుండా నిస్సహాయులుగా మిగిలిపోతున్నారు. దళారుల రాజ్యంలో పాలనయావత్తూ దళారుల కోసమే నడుస్తుంటే అహో రాత్రులు కష్టపడి పంటలు పండించే రైతులు కనీస సౌకర్యాలకు లాభసాటి ధరలకు నోచుకోక ఆత్మహత్యలకు పాల్పడే దయనీయస్థితి ఏ పాలకులకూ పట్టడం లేదు. మరోవైపు అధికధరలతో సామాన్య మధ్య తరగతి ప్రజలు సతమతమయిపోతున్నారు. అయితే ఇటు రైతులను అటు వినియోగదారులను పట్టించుకోని సాంప్రదాయక పార్టీలు మధ్య దళారీలకు ఊడిగం చేస్తున్నాయి.

రైతు పండించిన వళ్ళూ, కూరగాయలు ఆహార వస్తువులు, అన్ని రకాల దినుసులకు కష్టపడిపండించిన రైతుకు ఏదయినా వస్తువుకు రూపాయి దక్కితే, వినియోగదారులకు మాత్రం రూపాయి వస్తువు 10 రూపాయలకు దక్కుతోంది. ఆరు నెలల కష్టానికి రైతుకు రూపాయి దక్కితే వినియోగదారునికి చేరవేసే దళారులకు మాత్రం ఆ చేతికి ఈచేతికి మార్చినందుకు 10 రూపాయలు దక్కుతోంది. ఉదాహరణకు పాలు లీటరుకు రైతుకు 10 రూపాయలు ఇచ్చి నగరాలలో 30 రూపాయలకు దళారీలు అమ్ముకుంటున్నారు. ఈ దళారీలలో సాంప్రదాయక పార్టీలకు చెందిన వారి డైరీలే దోపిడీలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

సాగునీరు-తాగునీరు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలదే. అయితే ప్రాజెక్టులు, కాల్వలు, నిర్మించి నామమాత్రంగా శిస్తువసూలు చేసి సాగునీరు కల్పిస్తున్న పాలకులు, బావులు, బోర్లు, మోటార్ల ద్వారా వ్యవసాయ సాగుకు ఏ విధమైన సాయం అందడం లేదు. అందుకే రైతాంగం బావులు, బోర్లు ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టి 90శాతం మంది అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతుల అన్ని రకాల అప్పులను రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలే భరించాలి.

చెరువులను పూడ్చివేసి, ప్రభుత్వ ప్రయివేటు స్థలాలను కబ్జాచేసి రాత్రికి రాత్రి కోటీశ్వరులు కావాలన్న తలంపు ఉండే అతిపెద్ద అవినీతిపరులను ఉపేక్షిస్తే మనకు తాగడానికి, సాగుకు

నీరులేకుండా, ఉండడానికి నీడలేకుండా, దున్నుకోవడానికి భూమి మిగలకుండా పోతుంది. చెరువులు ఉంటేనే గదా వర్షపునీరు భూమిలోకి ఇంకుతాయి.

ఇల్లు తగలబడితే ఎవ్వరయినా ఆర్పడానికి ప్రయత్నిస్తారు చలికాచుకోవాలనో చుట్ట వెలిగించుకోవాలనో చూడరు. అదే విధంగా రైతులకు గిట్టుబాటు ధరలేకపోతే రాజకీయ నాయకులు సాయపడాలి. దళారీలను అడ్డుకుని మంచిధర వచ్చేలా చూడాలి. ముఖ్యంగా ప్రజల ఓటుతో అధికార దర్పం వెలగబెట్టే వారికి ఈవిషయంలో మరింత బరువు బాధ్యతలు ఉంటాయి. అయితే చిత్తూరుజిల్లా పాలరైతుల విషయంలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం ఉంది. నీళ్ళబాటిల్ 14రూపాయలు అమ్ముతున్నా రైతుకు పాలధర నీళ్ళ బాటిల్ ఖరీదు కూడ చేయదు. రైతుల అశక్తతను ఆసరాచేసుకున్న రాజకీయ నాయకులు అతి చౌకగా పాలను కొట్టేసి లీటరు 30రూపాయలకు అమ్ముకుంటున్నారు. అదేమంటే వ్యాపారమంటున్నారు. రైతు నోరు కొట్టడమే వ్యాపారమా? కర్నాటకలో రైతుకు వినియోగదారునికి మధ్య వ్యత్యాసం ఐదు రూపాయలు మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రైతుకు వినియోగదారుని మధ్య పాల ధర లీటరుకు 15 నుంచి 20 రూపాయలు ఉంది. ఆ మేరకు డైరీలు దోపిడీ చేస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో ఆవుపాలు లీటరుకు 25 రూపాయలు చొప్పున రైతులకు చెల్లించాలి. దీని కోసం లోక్‌సత్తాపార్టీ రైతుల తరపున ఉద్యమించనున్నది. వినియోగదారులు చెల్లిస్తున్న 30 రూపాయలలో 25 రూపాయలు రైతుకు దక్కాలి.

**లోక్‌సత్తా పార్టీ అవినీతి అనైతిక ఓటు బ్యాంకురాజకీయాలు, కుల, మత రాజకీయాలను వ్యతిరేకిస్తున్నందుకే సంప్రదాయ పార్టీలు తమ ప్రధాన దాడిని లోక్‌సత్తా పార్టీపై చేస్తున్నాయి.**

దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో అందరికీ స్వాతంత్ర్య ఫలాలు దక్కలేదు. గ్రామీణ, వ్యవసాయ అనుబంధ రంగాలవారికి, ప్రజలందరికీ తిండిగింజలు ఆహారపదార్థాలు అందించే రైతాంగానికి అసలు స్వాతంత్ర్య ఫలాలు దక్కడం లేదు. తాను పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు తాను ధర నిర్ణయించుకునే పరిస్థితి లేదు. తనకు దక్కాల్సిన లాభసాటి ధరలు తనకు దక్కవు. వీరి రాతను అటు దళారీలు ఇటు పాలకులు నిర్ణయించే పరిస్థితి ఉంది.

తరతరాలుగా వారసత్వంగా వస్తున్న అవినీతి రాజకీయనాయకులు, గూండాలు, కూనీకోరులు, భూకబ్జాదారులు, మధ్య దళారీలు, అవినీతి కాంట్రాక్టర్లు, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించే అధికార, అనధికారులు, స్మగ్లర్లు, అక్రమ వ్యాపారులు మాత్రమే స్వేచ్ఛా, స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నారు.

**లోక్‌సత్తా పార్టీ అవినీతి అనైతిక ఓటు బ్యాంకురాజకీయాలు,** కుల, మతరాజకీయాలను వ్యతిరేకిస్తున్నందుకే సంప్రదాయపార్టీలు తమ ప్రధాన దాడిని లోక్‌సత్తా పార్టీపై చేస్తున్నాయి. ప్రజల్లో విశ్వసనీయత కోసం ప్రజలు గౌరవంగా బతకడం కోసం, హుందాగా నీతి-నిజాయితీల కోసం పనిచేస్తున్న లోక్‌సత్తాపై సాంప్రదాయ పార్టీలు తమ విషాన్ని వెళ్ళగక్కుతున్నాయి. నిజంగా సాంప్రదాయక పార్టీలు నీతి-నిజాయితీలకు కట్టుబడి ఉంటే, అవినీతి, అక్రమాలకు అవకాశం ఉండకూడదన్న నమ్మకం ఉంటే లోక్‌సత్తా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అవినీతి వ్యతిరేకబిల్లును సమర్థించాలి గదా? అలా చేయలేదెందుకని?

మంచి పాలనకు సంబంధించిన విజన్2020 సిఫార్సులు, సమాచార హక్కు చట్టం రూపకల్పన, సిటిజన్ చార్టర్ ప్రవేశపెట్టడం, పౌరసేవా కేంద్రాలు, పార్టీ ఫిరాయింపులచట్టం, కేబినెట్ పరిమాణం తగ్గింపు, పోస్టాఫీసులలో ఓటర్ల నమోదుచట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, గ్రామ న్యాయాలయాల చట్టం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, పాలనా సంస్కరణల సంఘం, అవినీతి వ్యతిరేక చట్టం లాంటి ఎన్నో విప్లవాత్మక చట్టాలు, సూచనలు చేసిన జయప్రకాష్‌నారాయణ ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిగా సమాజంలో మార్పులు తీసుకురావడానికి ఎంతో కృషి చేసిన మేధావి. ఆయన సేవను దేశం కోసం ఉపయోగించుకున్న సాంప్రదాయ పార్టీలు అవినీతికి పాల్పడుతున్నాడంటూ తప్పుడు ఆరోపణలకు దిగడాన్ని రాజకీయ దివాళా కోరుతనం అనాలా? వద్దా?

డా॥ జయప్రకాష్‌నారాయణ సేవలను రాష్ట్ర కేంద్రప్రభుత్వాలు ఇంతకాలం ఎన్నో సంస్కరణల కోసం ఉపయోగించుకున్నాయి. సాంప్రదాయక పార్టీలు రెండూ లోక్‌సత్తాపార్టీ ఉద్యమాన్ని నిర్వహిస్తున్న రోజుల్లో సందర్భంగా ఆయన 30 ఏళ్ళ సర్వీసును నీతి, నిజాయితీగా నిర్వహించారని

కొనియాడాయి. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి హోదాలో ఆయన తను నమ్మిన సిద్ధాంతం కోసం, విలువల కోసం, న్యాయం కోసం, నీతినిజాయితీల కోసం సమాజాన్ని మారుద్దాం రండి అని పిలుపునిచ్చి, ఉన్న ఉద్యోగాన్ని వదులుకొని లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థను లోక్‌సత్తా రాజకీయ పార్టీని ఏర్పాటు చేసినందుకు ఇప్పుడు ఇన్ని విమర్శలకు దిగుతారా? **సంప్రదాయ పార్టీలకు ఇక ప్రజలలో నూకలు చెల్లిపోతాయోమోనని ఆందోళన ఏర్పడటంతో తమకు అంటుకున్న బురదను జయప్రకాష్ నారాయణపై వేయడానికి చూస్తున్నాయి. ఆయనకు సంపాదనే కావాలనుకుంటే ఐఎఎస్ పదవి ఎందుకు వదులుకోవాలి?**

మహాత్మాగాంధీ నాటి కాంగ్రెస్, ఎన్.టి. రామారావు నాటి తెలుగుదేశం పార్టీలు యదాతథంగా ఈ నాటికి లేవు. ఉన్నదల్లా అవకాశవాద, అవినీతికర విధానాలతో కూడిన పార్టీలే. ఈ సంప్రదాయకపార్టీలు ప్రజలను మరిచిపోయి చాలాకాలం అయింది. ఆ పార్టీలు దోపిడీ బాటపట్టి చాలా కాలం అయింది. ఇదే పరిస్థితి కొనసాగితే వెనకతరం అనేక ప్రమాదకర పరిస్థితులల్లో బతకాల్సి వస్తుంది. ఇప్పటి తరానికే సమాజం ఎన్నో అవాంతరాలకు నిలయమయింది. ఈపోరాటమంతా మార్పుకోసమే అన్నది అందరికీ తెలిసిందే. లోక్‌సత్తా ఓ ఉద్యమసంస్థగా దేశచరిత్రలోనే అనేక మైలురాళ్ళ లాంటి విజయాల్ని సాధించినా వాటిని అమలుచేసే రాజకీయ వ్యవస్థ లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో లోక్‌సత్తాను డాక్టర్ జయప్రకాష్‌నారాయణ రాజకీయ సంస్థగా ప్రారంభించారు. ప్రజలకు అధికారం ఇచ్చే కొత్త రాజకీయం సాకారమయ్యేంత వరకు. ఖచ్చితంగా ఈ భావాన్ని మోద్దాం. లక్ష్యాన్ని సాధిద్దాం.

> **ఓట్లు కొనే రాజకీయం టెర్రరిజంకంటే భయంకర మయింది. చెడ్డవారి దుర్మార్గం కన్నా మంచివారిమౌనం అత్యంత ప్రమాదకరం.**

రాజకీయం వ్యాపారం కావడానికి వీలులేదు. ప్రజాస్వామ్యంలో కావాల్సింది ధనరాజకీయం కాదు. జనరాజకీయం.

ఓట్లు కొనే రాజకీయం టెర్రరిజంకంటే భయంకరమయింది. చెడ్డవారి దుర్మార్గంకన్నా మంచివారిమౌనం అత్యంత ప్రమాదకరం.

ఓటు వేయకపోవడం పౌరసత్వబాధ్యతను నెరవేర్చకపోవడమే సమాజం మార్పు మన చేతిలో ఉంది. మార్పుమనం వేసే ఓటులో ఉంది. ఈ సంఘంలో పేదోడికో న్యాయం, పెద్దోళ్ళకొకన్యాయం అనేవి తరతరాలుగా సాగుతున్న దురన్యాయంగా సాగుతోంది. డబ్బులు ఉన్న వాడికో న్యాయం. డబ్బులు లేనివాడికో న్యాయం అనేవి రాష్ట్రంలో ఏ పోలీసు స్టేషనుకు వెళ్ళినా, రెవిన్యూ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపాలిటీలు, ఆసుపత్రులు, పంచాయతీలు, జిల్లా రాష్ట్ర కార్యాలయాలలో ఎక్కడికి వెళ్ళినా మనకు తారసపడే రాక్షసన్యాయం అదే. అదే విధానాన్ని, అవినీతికర, దుష్టసాంప్రదాయాన్ని సాంప్రదాయక పార్టీలు కూడా ప్రోత్సహించి, పెంచి పోషిస్తున్నాయి. ఓట్లు కొనుగోలుతో మొదలయ్యే ఈ అవినీతి అన్ని స్థాయిలలో పేరుకుపోవడానికి ప్రధానకారణం పాలకవర్గాల విధానాలే. అందుకే మంచి రాజకీయ మార్పుకు లోక్‌సత్తా పార్టీని డాక్టర్ జయప్రకాష్‌నారాయణ రూపొందించడం జరిగింది. లోక్‌సత్తా పార్టీ అధికారంలోకి వస్తే అందరికీ సమన్యాయం, విద్య, ఆరోగ్యం ఉచితంగా అందిస్తుంది.

మంచివారిని, పదిమంది మేలుకోరే వారిని సమర్థించకపోయినా పరవాలేదు. వారిని వారి మంచి తనాన్ని, మంచి ఆశయాన్ని చులకన చేసి మాట్లాడటం తగదు. అలా చేస్తే కన్నతల్లిని, తండ్రిని అవమానించినట్లే. ప్రతి విషయాన్ని చులకనగా చేసి మాట్లాడితే ఆ తరువాత పదిమందికోసం పనిచేసేవారు, మాట్లాడేవారు నీతి, న్యాయం కోసం, ధర్మంకోసం నిలబడే వారు ఇక మిగలరు. అంతేకాదు మంచి ఆలోచనలు ఉండే వారు సమాజం కోసం మంచిపనిచేసే వారు తెరమరుగయిపోతారు. అది సమాజానికి ఎంతో ప్రమాదకరం. అంతేగాక దుష్టసంప్రదాయ పార్టీలను ప్రోత్సహించినట్టవుదనడం లో ఎలాంటి సందేహం లేదు.

**వారసత్వ రాజకీయాలు, బంధుప్రీతి రాజకీయాలు కారణంగా సమాజంలో మంచివారు, మంచిసేవా భావం ఉన్నవారు, నీతి నిజాయితీ, ధర్మం, న్యాయం కోసం పోరాడేవారు సమాజంలో కరవైపోతారు.**

**ఓట్లు కొనవద్దు. మద్యం పంచవద్దు. రౌడీయిజం చేయద్దు. గూండాయిజం ప్రోత్సహించవద్దు.** న్యాయం, ధర్మాలను చంపొద్దు అనేవి బూతుపదాలు కాదు గదా? అయితే అవే కొంత మంది దృష్టిలో దుర్మార్గపు రాజకీయాలుగా కనబడుతున్నాయి. ఓటును కొనేవాడు, ప్రతి ఓటుకు ఇచ్చేది వందరూపాయల

నుంచి వెయ్యి రూపాయలు. బ్రాందీసీసాలకు మరో వందనుంచి రెండువందల రూపాయలు, అయితే ఆ ఓటును కొన్న శాసనసభ్యుడు ఐదుశాతం ముడుపులు తీసుకున్నా ఒక్కొక్క ఓటరుపైన ఐదువేల రూపాయలు కాజేసినట్టు.

దేశంలో ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చిస్తున్న నిధులు ఏటా 12 లక్షల కోట్లు. ప్రతి మనిషి మీద ఏడాదికి 12వేలు ఖర్చుపెట్టాలి. ప్రతి కుటుంబం మీద ఏడాదికి 60వేలు ఖర్చు పెట్టాల్సిఉంది. ఆ నిధులతో పిల్లందరికీ ఉచిత విద్య, కుటుంబానికంతా ఉచిత ఆరోగ్యం, బతకడానికి ఇల్లు, బట్టలు, తిండికి కొరత లేకుండా జీవించవచ్చు. అయితే ఓట్లు కొనుకున్న ప్రజాప్రతినిధులవల్లనే ఈ తారతమ్యాలు వచ్చాయి. మనకు దక్కాల్సిన సొమ్ము అక్రమమార్గంలో రాజకీయ నాయకులకు కమీషన్ల పేరుతో, కాంట్రాక్టులు, అవినీతి పరుల ద్వారా చేరిపోయి 90శాతం మంది పేదరికంలో మగ్గిపోవలసివస్తున్నది.

> **వారసత్వ రాజకీయాలు, బంధుప్రీతి రాజకీయాలు కారణంగా సమాజంలో మంచివారు, మంచిసేవా భావం ఉన్నవారు, నీతి నిజాయితీ, ధర్మం, న్యాయం కోసం పోరాడేవారు సమాజంలో కరవైపోతారు.**

రాజకీయాలను కాదు నిందించాల్సింది. దుష్ట రాజకీయాలను, అవినీతి రాజకీయాలను మాత్రవే వ్యతిరేకించాలి లేదంటే చెడిపోయిన రాజకీయం బాగుపడదు.

రాజకీయాలు కేవలం ధనవంతులకు, రౌడీలకు, కబ్జాదారులకే కాదు. మంచివారు రాజకీయాలకు దూరంగా ఉండటంవల్లనే దుర్మార్గులు కోటీశ్వరులు, గూండాలు, భూకబ్జాదారులు రాజకీయ అవతారం ఎత్తుతున్నారు. మంచివారు లేకుంటే సామాన్య, పేద మధ్య తరగతి కుటుంబాలను దుర్మార్గ రాజకీయాలు శాసిస్తాయి. డబ్బు సంపాదనకే రాజకీయాలు నిలయమవుతాయి. మంచితనం మాయమై చెడు సాంప్రదాయాలు పుట్టుకొస్తాయి. ప్రజాస్వామ్యాన్ని పాతిపెడతాయి. ప్రజాసేవ రాజకీయాలు కనుమరుగయిపోతాయి. అందుకే ధన రాజకీయాలు వదిలిద్దాం, జనరాజకీయాన్ని సాధిద్దాం అని లోక్‌సత్తా పిలుపునిస్తోంది. ఇందుగల అందులేదని సందేహం వద్దయా? ఎందెందు వెదికినా అవినీతేనయా అని మీరు ఏ పోలీసుస్టేషనుకు వెళ్ళినా, రెవిన్యూ, మండల విద్యుత్, వ్యవసాయ, ఆరోగ్య, ఏ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళినా లంచం.... లంచం.... లంచం... అంటూ అవినీతి జాడ్యం ఎదురవుతుంది.

ఓటుకు అమ్ముడయితే మరొకరికి అవినీతి గురించి ప్రశ్నించే హక్కు మనకు ఉండదు. అధికారం మనది, పెత్తనం మనది కావాలంటే కమీషన్ల దండుకునే సంప్రదాయ పార్టీలకు ఓట్లువేయకూడదు.

రైతులకు కావాల్సింది గిట్టుబాటు వ్యవసాయం కాదు. లాభసాటి వ్యవసాయం కావాలని లోక్‌సత్తా పార్టీ కోరుతోంది. ఇంటి ముందు ప్రభుత్వం, కంటిముందు పాలన లోక్‌సత్తా లక్ష్యం.

ప్రతి వ్యవసాయ కుటుంబం ఒక సంవత్సరానికి ఒక ఎకరా పంట పండించడం వల్ల వారి ఖర్చులుపోను ఆదాయం 500 రూపాయలు మాత్రవే. వారు ధరలు రూపంలో పోగొట్టుకుంటున్నది 50వేల రూపాయలు ప్రతి కుటుంబం ఒక ఆవు, పాలవల్ల సంవత్సరానికి ఒక లీటరుపై పోగొట్టుకుంటున్న ఆదాయం 10వేల రూపాయలు, ఐదు లీటర్లపై 50వేలు నష్టపోతున్నారు. ఒకలీటరు ఆవుపాలపై ఉదయం పూట 25 రూపాయలు, సాయంత్రంపూట 25 రూపాయల చొప్పున వ్యవసాయ కుటుంబానికి దక్కాలి. అయితే 10 నుంచి 15 రూపాయలతోనే సరిపుచ్చుతూ మధ్య దళారీలు ఆ పాలను 30 రూపాయలకు పట్టణాలలో అమ్ముకుంటున్నారు. దీనికి తోడు వెన్నెను కూడ జుర్రుకుంటున్నారు. దీనిని లోక్‌సత్తా ప్రతిఘటించనుంది.

లోక్‌సత్తా తలపెట్టిన ఈ యజ్ఞాన్ని స్వచ్ఛమైన రాజకీయం ద్వారా నీతి-నిజాయితీలతో మార్పు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకొంది. ఈ మార్పురాజకీయాల కోసం మౌన ప్రేక్షకుల్లా ఉండకుండా ప్రజలంతా ముందుకొచ్చి భాగస్వాములు కావాలని లోక్‌సత్తా పార్టీ పిలుపు నిస్తున్నది రండి. చేయి చేయి కలుపుదాం. లక్ష్యాన్ని సాధిద్దాం. ★

## ఉరకలెత్తే యువశక్తిని లోక్‌సత్తా పిలుస్తోంది

# పెయిడ్ ఆర్టికల్స్ - మీడియా చీకటికోణం

బిజినెస్ స్టాండర్డ్, న్యూఢిల్లీ సౌజన్యంతో

**లోక్‌సత్తా పార్టీ నిజాయితీగా సేకరించిన వివరాలతో ఎన్నికల కెళుతూంటే సంప్రదాయ పార్టీలు లెక్కలు చూపని డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ ఎన్నికల ఫలితాలను శాసిస్తున్నాయి. లోక్‌సత్తా ఒక రూపాయి ఖర్చు చేస్తే అవతల పార్టీలు అందుకు వందరెట్లు ఖర్చుపెడుతున్నాయి. ఆ చీకటికోణానికి అద్దం పట్టే వ్యాసమిది.**

**ఈ డబ్బుతోనే మీడియాలో space కొనుగోలు చేసే ప్రకటనలను వార్తలరూపంలో ఇన్తూ ప్రజల్ని భ్రమింపచేస్తున్నాయి.** పెయిడ్ ఆర్టికల్స్‌ను వార్తలుగా నమ్మించే మీడియా మురికి చీకటి కోణం 'ది హిందూ' పత్రిక బయటపెట్టిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్ ఘనకార్యం ద్వారా బట్టబయలైంది. దిహిందూ పత్రిక బయటపెట్టిన విషయం ప్రకారం ముఖ్యమంత్రి రూ.5,379 పత్రిక ప్రకటనలకు ఖర్చుపెడితే - ముఖ్యమైన మరాఠీ దినపత్రికలు చవాన్‌గారి గొప్పదనాన్ని కీర్తిస్తూ అవే కథనాలని వార్తలుగా ప్రచురించాయి. 'ది హిందూ' పత్రిక దీనిని ప్రకటనలకు ముసుగు కప్పుకున్న మరో రూపంగా నిర్ధారించింది. ఈ కథనాలను ఒకవేళ ప్రకటనలుగా ప్రచురించినట్లయితే అయ్యే ఖర్చును విలువకట్టి ముఖ్యమంత్రి ఎలక్షన్ కమీషన్ అసెంబ్లీ ఎన్నికల నిబంధనలకు మించి ఖర్చు చేసి ఉల్లంఘించారని నిర్ధారించింది. కొద్దిరోజుల తరువాత 'మింట్' పత్రిక టామ్ మీడియా రిసెర్చ్ అనే మీడియా మానిటరీ ఏజెన్సీ చేసిన విశ్లేషణ ప్రచురించింది. దానిప్రకారం ఎలక్షన్ ప్రకటనల ఖర్చు 2004తో పోల్చితే అయిదో వంతుకు పడిపోయినట్లుగా (మరాఠీ పత్రికలలో) పేర్కొంది. ఇది రాజకీయ నాయకులు పత్రికలకు ప్రకటనల రూపంలో కాకుండా వారికి సంబంధించిన వార్తలు ప్రచురించినందుకు డబ్బు చెల్లిస్తున్నట్లుగా నిరూపించింది.

డబ్బు తీసుకుని వార్తలు ప్రచురించే ప్రక్రియకు ప్రోత్సాహం బెనెట్ కోల్‌మన్ కంపెనీ (టైమ్స్ ఆఫ్ ఇండియా మరియు ఎకనామిక్ టైమ్స్ ప్రచురణకర్తలు) విడిగా ప్రైవేటు ఒడంబడిక ఒప్పందాల విభాగము ఏర్పరచి ఉచితంగా ప్రకటనలు ఇచ్చినందుకుగాను కంపెనీల ఈక్విటీలో భాగం తీసుకోవడం మొదలుపెట్టింది. నిజానికి ఈ ఒప్పందంలో తప్పేమీ కనపడదు కానీ ఆయా కంపెనీల షేర్ విలువలు పెరిగితే బెనెట్ కోల్‌మన్ కంపెనీ లాభపడుతుంది. కాబట్టి ఆ పత్రికలు ఆయా కంపెనీల విలువను పెంచే కథనాలకు ప్రాముఖ్యతనిస్తాయి. తద్వారా ఆయా కంపెనీలు లాభపడేలా ప్రజాభిప్రాయాన్ని మలుస్తాయి. చాలా సందర్భాల్లో గ్రూప్ ప్రచురణల సంపాదకులు వ్రాసిన ఇ-మెయిల్స్ లీక్ కావడం ద్వారా తమ సహచరులని ప్రైవేట్ ట్రీటి కంపెనీల కవరేజి పెంచే మార్గాలు చూడమని కోరారు. బెన్నెట్ కోల్‌మనీ కంపెనీ ఈ రకమైన వత్తిడులు లేవని చెప్పినప్పటికీ వార్తలను అమ్ముకునే ఆ ప్రక్రియ చాలా ఇతర మీడియా గ్రూప్‌లు కూడా వేర్వేరు పేర్లతో ఈ రకమైన విభాగాలను ఏర్పరచడానికి తోడ్పడింది. ఈ ఎత్తు ప్రకటనదారుల, మీడియా యజమానుల కొంగు బంగారమైంది.

ఇక్కడే సమస్య అంతా వుంది. దీన్ని ఏ రకంగా పరిష్కరించగలం? డిసెంబర్ 2వ వారంలో జరిగిన సమావేశంలో ఈ విషయంపై చర్చించి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (PCI) నైతిక విలువల కమిటీని ఏర్పాటు చేసింది. కాని తనలోని భాగస్వాములైన పెద్దల పాత్ర అనూమానాస్పదమైననప్పుడు (PCI) మాత్రం ఏం చేయగలుగుతుంది? ఎలక్షన్ కమీషన్‌ని కూడా (PCI) సమావేశానికి ఆహ్వానించింది. కాని అది ఈ విషయాలను నిరూపించే అవకాశాలు తక్కువ. దీన్ని చవాన్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించాడా లేదా కంటే మిన్నగా డబ్బులు ఇచ్చి వేయించుకున్న వార్తలను ప్రజలు ఏ విధంగా నమ్ముతారన్న ప్రశ్నలను రేకెత్తిస్తుంది. ఎంతోమంది జర్నలిస్టులు ఈ డబ్బులిచ్చి వార్తలు ప్రచురించే పత్రికలను ఎత్తి చూపగలిగినా, పరిష్కారం వెతకడం కష్టతరం. ఇలా డబ్బులిచ్చి వార్తలు రాయించుకునేవాళ్ళని పత్రికలతో ఈ వ్యవహారం నడపొద్దంటే వినరు. ఎందుకంటే తద్వారా వాళ్ళు లాభపడుతుంటారు కాబట్టి. కాని హిందూ పత్రిక బట్టబయలు చేసిన వైనాల వంటి వల్ల వాళ్ళు చదివింది వార్త కాదని ప్రకటన అని అర్థం చేసుకోగలుగుతారు. సెబి లాంటి సంస్థలను పత్రికల్లో వచ్చే ఈ రకమైన వార్తల రూపంలో అబద్ధపు ప్రకటనలను నియంత్రించేందుకు వినియోగిస్తే అది ప్రభుత్వం పత్రికలను చేసే ఆయుధంగా ఉపయోగపడే ప్రమాదం వుంది. అప్పటి వరకు ఇది పాఠకుల, వీక్షకుల విజ్ఞతపై మీడియా గ్రూప్‌ల అపవిత్ర దాడిగా భావించవచ్చు. ★

# మహిళాసత్తా చేసిన కార్యక్రమాలు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక



మహిళాసత్తా ఆధ్వర్యంలో 'మహిళా రిజర్వేషన్ బిల్లు' లో వున్న లోటుపాట్లపై బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తేదీ: 1-7-2009 అఖిలపక్షాలు మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమక్షంలో చర్చావేదికను నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగానే కొన్ని జిల్లాల్లో కూడా ఈ విధమైన చర్చావేదికల్లో మహిళాసత్తా పాలుపంచుకుంది.

రాష్ట్రవ్యాప్తంగా మహిళాసత్తా నియోజకవర్గ స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి, పటిష్టపరచేందుకు 22-8-2009 తేదీన 'రాష్ట్ర మహిళాసత్తా పునర్వ్యవస్థీకరణ కమిటీ'ని ఏర్పాటు చేయటం జరిగింది. తరువాత ఆ కమిటీకి శిక్షణ ఇవ్వడమేగాక గతంలో చేసిన కార్యక్రమాలను గూర్చి చర్చించడం జరిగింది. సమాజంలో మహిళలపై జరిగే దాడులు, అత్యాచారాలు, హింసాత్మకమైన సంఘటనలు దృష్టిలో పెట్టుకుని మహిళాసత్తా తరపున ఇ. పద్మావతి, సుధాబాలలతో కూడిన లీగల్‌సెల్ ని ఏర్పాటు చేయటం జరిగింది. ఈ లీగల్‌సెల్ వారి సహకారంతో విశాఖ అమ్మాయి మధురిమ, నిజామాబాద్ జిల్లా లావణ్యలకు జరిగిన దారుణ సంఘటలను డిజిపి, మానవహక్కుల సంఘం, హోంశాఖ మంత్రుల దృష్టికి సత్వరమే తీసుకువెళ్ళి సమస్యని పరిష్కరించే విధంగా, ప్రభుత్వ సహాయం అందేలా మహిళాసత్తా పూర్తిగా కృషి చేసింది. ఇంతే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింసాత్మక చర్యలకు రాష్ట్ర స్థాయి ఐక్యవేదిక తరపున నిరసనలను కూడా చేపట్టడం జరిగింది. మద్యంపైన కూడా అఖిలపక్షంతో కలిసి చర్చల్లో పాల్గొని బెల్టుషాపులను తొలగించాలని, మద్యం టార్గెట్‌ను పెంచవద్దని వ్యతిరేకించడం జరిగింది.

నల్గొండ, కర్నూలు, మహబూబ్‌నగర్, కృష్ణా జిల్లాల్లో వరదబీభత్సానికి గురైన బాధితుల సహాయార్థం మహిళాసత్తా ఆధ్వర్యంలో హైదరాబాద్ నగర ప్రధాన కూడళ్ళలో చేపట్టిన విరాళాల సేకరణలో ప్రజల నుండి విశేష స్పందన లభించడమే కాక రూ॥ 1.25 లక్షల నగదు, బియ్యం, మందులు, దుస్తులు, ఇతర సామాగ్రిని సేకరించటం జరిగింది.

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో కూడా రాష్ట్ర మహిళాసత్తా అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి, ప్రధాన కార్యదర్శి కె. గీతామూర్తి, ఉపాధ్యక్షురాలు యస్. మనోరమ, కె. నాగమణి, ఆర్. ఝాన్సీలక్ష్మి, డి. లక్ష్మి, వై. రమాదేవి, డి. సరోజ, ఎ. సుభాషిణి, ఎమ్. మహాలక్ష్మి, ఎమ్. సుధాబాల, వి. శైలజ, ఎ. రమణి, ఒ. శ్రీదేవి, బి. లక్ష్మిప్రియ, వి. సుజాత, జిహెచ్‌ఎమ్‌సి మహిళాసత్తా అధ్యక్షురాలు టి. పద్మజారాణి, ఎ. విమలాదేవి, శారద, వీరు కాక మంగళ, ఇందిర, మాధవి, నాగమణి, పి. లక్ష్మి, సుమ, జి. పద్మ, వై. రమణి, కృష్ణవేణి అన్ని జిల్లాల మహిళాసత్తా నుండి డా॥ రాధాదేవి, శంకరమ్మ, మేకల సరోజా, లలిత సుధ, సరళకుమారి, రాజమణి, జ్ఞానాంబ, మీనాక్షి, ఎకె.లత, రత్నకుమారి, గంగాసరళ, పద్మారాణి, లలితకుమారి, డా॥ వసంత, కె.ఆర్. ప్రియదర్శిని తదితర మహిళా సభ్యులందరూ కూడా వలంటీర్స్‌గా వచ్చి వారి సేవలు అందించారు.

మహిళాసత్తాని మరింత బలోపేతం చేయటానికి ఎన్నికల అనంతరం తేది: 2-12-2009 నుండి గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని డివిజన్ స్థాయిలలో, డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సమక్షంలో, మహిళాసత్తా కమిటీలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

**మహిళాసత్తా భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాల ఎజెండా :**

1. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌షిప్ ( మహిళలు, ప్రముఖులు) 2. మద్యనియంత్రణ, 3. ప్రభుత్వ పాఠశాలలు + బాలికల హాస్టల్స్, 4. ప్రభుత్వ ఆసుపత్రులు, 5. మహిళాసమస్యలు - కౌన్సిలింగ్, 6. ఓటరు ఐడెంటిటీ, 7. మహిళా అధికార ప్రతినిధులు, 8. మహిళా రిసోర్సు పర్సన్స్, 9. రాష్ట్ర ఉద్యమ కార్యక్రమాలు, 10. డ్వాక్రా గ్రూపు, పొదుపు సంఘాల మహిళలతో సమావేశాలు 11. నాయకత్వ లక్షణాలు వున్న మహిళలను గుర్తించి ప్రోత్సహించటం, శిక్షణ, 12. లోక్‌సత్తా కార్యక్రమాలలో పాలుపంచుకోవడం. ★

# బలోపేతం కానున్న యువసత్తా



రానున్న స్థానిక ఎన్నికల నాటికి రాష్ట్రవ్యాప్తంగా  పెద్ద సంఖ్యలో యువతను ఆకట్టుకొనే కార్యక్రమాలలో యువసత్తాను బలోపేతం చేసి లోక్‌సత్తా పార్టీ చేపట్టబోయే ఉద్యమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు తమ తోడ్పాటును అందిస్తామని రాష్ట్ర యువసత్తా కార్యవర్గ సభ్యులు ప్రతిజ్ఞ చేసారు. ఈ సమావేశానికి రాష్ట్ర యువసత్తా అధ్యక్షులు  దాసరి రత్నం అధ్యక్షత వహించారు. రాష్ట్ర యువసత్తా రానున్న 6 నెలల కార్యాచరణ ప్రణాళికను చర్చించి  పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా అవి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను ముందుగా పర్యటించి జిల్లాల వారీగా యువసత్తా కమిటీలను పర్యవేక్షించేందుకుగాను నలుగురు సభ్యులను జోనల్ కన్వీనర్‌లుగా యువసత్తా ఎంపిక చేసింది. కోస్తాంధ్రా జిల్లాలకు పంచాది రాంబాబు, తెలంగాణా జిల్లాలకు కె. ఆంజనేయులు, ఎమ్. శ్రీధర్, రాయలసీమ జిల్లాలకు రమణారెడ్డిలు జోనల్ కన్వీనర్లుగా వ్యవహరిస్తారు. వీరు నెలరోజుల పాటు  జిల్లాల్లో పర్యటించి జిల్లా యువసత్తా కమిటీలను క్రియాశీలం చేయటంలో సహకరిస్తారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువసత్తా సలహాదారులు పాండురంగారావు, ప్రధాన కార్యదర్శి రాజరామక్రిష్ణవర్మ, కార్యవర్గ సభ్యులు బి.ఎల్. నవీన్‌కుమార్‌శర్మ, కె. ఆంజనేయులు, గోక మంగళ, పంచాది రాంబాబు, పి. శివాజీ రాజు, ఎమ్. రామలింగారెడ్డి, పి. శ్రీరామ్, ఎన్.డి. రాజమనోహర్, ఎ. సాయిలు, ఎమ్. శ్రీధర్, ఎమ్.బి.బి.ఎస్.ఎ. రాజు, ఎన్. సంజీవ్, పి. శ్రీనివాసులు, జె.ప్రసాద్, టి.వి.వి సత్యనారాయణ డి. రాము. కె.వి.ఎన్.డి.వి. ప్రసాద్, బి. రమేష్, ఆర్. రవీందర్ రెడ్డి, జి. ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



లోక్‌సత్తా పార్టీ యువసత విభాగం ‘ యువసత్తా’ బృందం మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ మేయర్ శ్రీమతి కార్తీకరెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియచేసి ప్రస్తుత విద్వేష రాజకీయాల తరుణంలో మహానగరంలో వివిధ ప్రాంతాల ప్రజల మధ్య శాంతిసుహృద్భావాలను కాపాడవలసిందిగా వినతిపత్రాన్ని సమర్పించింది. ప్రధాన కార్యదర్శి నవీన్‌శర్మ, కార్యదర్శి శివాజీరాజా, జిహెచ్‌ఎంసి అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, రాంబాబు, రామలింగారెడ్డి తదితరులు బృందంలో ఉన్నారు. ★

## విద్యార్థి సత్తా ప్రారంభం

ఆంధ్రప్రదేశ్‌తో మొదలుపెట్టి భారతదేశంలో రాజకీయాల్ని ప్రక్షాళన చేసి ‘ప్రజలకే అధికారం’ అందించే కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మించాలని పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీకి తన లక్ష్యసాధనలో విజయం సాధిస్తానన్న నమ్మకం ఉందంటే అది కేవలం యువత పట్ల వున్న అపార విశ్వాసమే. మన జనాభాలో 70% దాకా యువత ఉండటం, ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండడం కొత్త రాజకీయానికి గట్టి బలాన్ని ఇస్తుంది. అందుకే లోక్‌సత్తా ‘కొత్త తరానికి – కొత్త రాజకీయం’ అనే నినాదంతో ముందుకు వెళ్తోంది. మంచి మార్పును నిష్కల్మషంగా నిండుమనస్సుతో స్వీకరించే సత్తా యువతలో ఎక్కువగా ఉంటుంది. అయితే యువత పాత్ర ఒక క్రమ పద్ధతిలో నిర్మాణాత్మకంగా వుండాలంటే విద్యార్థి దశ నుంచి వారికి కొత్త రాజకీయం భావజాలం గురించి అవగాహన పెంచుతూ రావాలి.

విద్యార్థి దశ నుంచి వారు పార్టీ భావజాలం గురించి తెలుసుకుంటూ, పార్టీ కార్యకలాపాల్లో భాగస్వాములవుతూ రావటం వల్ల రాజకీయం మార్పునకు మంచి పునాది ఏర్పడుతుంది. మార్పునకు బలమైన వేదికగా పార్టీ కూడా రూపుదిద్దుకుంటుంది. నిజానికి అమెరికాలోని ఆఫ్రో అమెరికన్ ఉద్యమం కావచ్చు, చైనాలోని లాంగ్‌మార్చ్ ఉద్యమం కావచ్చు, మనదేశంలోని స్వరాజ్య ఉద్యమం కావచ్చు, ఆధునిక యుగంలో అన్ని కీలక రాజకీయ ఘటనలలో విద్యార్థులు కీలకపాత్ర పోషిస్తూ విజయవంతం కావటంతో తోడ్పాటునందించారు. 1974లో లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ చేపట్టిన సంపూర్ణవిప్లవ పోరాటం ఎదగటానికి విద్యార్థుల బలమే ప్రధాన కారణం. భారతదేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమే కాదు, మౌలికం కూడా. పార్టీ నిర్మాణంలో ప్రచారంలో కాక ఓటు శక్తిగా కూడా వారు ప్రధాన పాత్ర పోషించగలుగుతారు. వారసత్వాలకు తావులేకుండా విద్యార్థి శక్తిని కొత్త రాజకీయాలలో భాగం చేసేందుకు వేదికను కల్పిస్తున్న లోక్‌సత్తా ఆ ప్రయత్నంలో భాగంగానే **‘విద్యార్థి సత్తా’** విభాగాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ★

# జిల్లాల్లో లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు



## చిత్తూరు జిల్లా:

**తిరుపతి :** అవినీతి అంతానికి లోక్‌సత్తా పార్టీ తిరుపతిలో శంఖారావం పూరించింది. ప్రపంచ అవినీతి దినం సందర్భంగా తిరుపతి బాలాజీ కాలనీలో బుధవారం సాయంత్రం ప్రజా అవగాహన చైతన్య సదస్సును నిర్వహించింది. సదస్సులో ముఖ్య వక్తలుగా మయూర గ్రూప్ ఆఫ్ సంస్థల చైర్మన్ జయరామచౌదరి, తితి ధర్మప్రచార పరిషత్ (డీపీపీ) మాజీ కార్యదర్శి సముద్రాల లక్ష్మణయ్య అవినీతి అంతంపై ప్రసంగించారు. దేశ సమగ్ర అభివృద్ధి, సార్వభౌమాధికారాన్ని సాధించాలంటే విద్యావంతులు అవినీతి రాజకీయాలను ఓటుతో మట్టుపెట్టాలని వివరించారు. సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు చెన్నయ్య, రమాదేవి తదితరులు మాట్లాడారు.

### అవినీతిని ఎదుర్కొన్నవారికి సన్మానం

జిల్లాలో అవినీతిని బహిర్గతం చేసేందుకు కృషిచేసిన మాగంటి గోపాల్‌రెడ్డి, నరసింహా రెడ్డి, రఘునాధ, రమణను ముఖ్య అతిథులుగా విచ్చేసిన లక్ష్మణయ్య, జయరామచౌదరి సన్మానించి సత్కరించారు. బహిరంగ సభ అనంతరం ట్రాక్టరుకు అవినీతి రాక్షసుడి చిత్రపటాన్ని వేలాడదీశారు. జయరాంచౌదరి జెండా ఊపి ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపు బాలాజీ కాలనీ, టౌన్ ప్రకాశం రోడ్డు, తిలక్‌రోడ్డు, నగరపాలక సంస్థ కార్యాలయం మీదుగా, శ్రీకృష్ణదేవరాయుల కూడలి వరకు చేరుకుంది.

### వ్యాసరచన పోటీ విజేతలు

ఈ సందర్భంగా విద్యార్థులకు అవినీతిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చందన, మహమ్మద్‌బాషా, కోమల, కుందనశిల్ప, నయనకుమార్, రెడ్డిరాణి, నిఖిలశ్రీ, కల్యాణ్‌కుమార్, స్వాతి, గుణలక్ష్మి మొదటి పది బహుమతులు అందుకున్నారు. వీరికి భారతరాజ్యాంగం పుస్తకాన్ని బహుకరించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు సిద్ధయ్యనాయుడు, నీలకంఠేశ్వర, వెంకటేశ్వర్లు, సుధాకర్‌వర్మ, బెల్లంకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## కృష్ణాజిల్లా:

**మచిలీపట్నం ఈడేపల్లి:** అవినీతి నిర్మూలనలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ సిలార్ అన్నారు. స్థానిక చిత్రకళా సంసద్‌లో బుధవారం లోక్‌సత్తా ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలనా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. యుటిఎఫ్ నాయకుడు పి. వెంకటేశ్వరరావు, రామ్మోహనరావు, రామకృష్ణాలు పాల్గొన్నారు. బందరు డివిజన్ లోక్‌సత్తా కన్వీనర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో లయన్ జంగాల హరనాథబాబు విజేతలకు బహుమతులు అందజేశారు.

**పటమట :** రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తోందని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని లోక్‌సత్తా ఆధ్వర్యంలో బుధవారం బెంజిసర్కిల్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంపదను ఎవరికి వారు ఇష్టానుసారం దోచుకుంటున్నారని ఆరోపించారు. భూముల అమ్మకం, గనుల తవ్వకం, నీటి పేరిట దోపిడీ, స్విస్‌బ్యాంక్ ఖాతాలు పెరిగిపోయాయని ఆరోపించారు. ప్రజలు చైతన్యవంతులై అవినీతిపై పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాజకీయ నాయకులను చూసి అధికారులూ అవినీతికి పాల్పడుతున్నారని, కోట్ల రూపాయల ఆస్తులు కూడగట్టుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర నాయకుడు కేవీపీ బసవేశ్వరరావు, బి. సత్యనారాయణ, ఎన్‌ఎం డాంగే, బేగ్, కృష్ణారావు, పూర్ణ, శివ, మహిళా నాయకులు రాజమణి, కె. జ్ఞానాంబ, సరళకుమారి, విజయలక్ష్మి, మాలతి పాల్గొన్నారు. .





**ఖమ్మం జిల్లా**

లోక్‌సత్తా కార్యాలయంలో తేది 9-12-2009న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షులు - జూపల్లి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి చింతల లింగేశ్వరరావు, యువసత్తా రాష్ట్ర కార్యదర్శి కుడికాల ఆంజనేయులు పట్టణ అధ్యక్షులు పి.ఎస్.ఆర్.కె. ప్రసాద్



**అనంతపురం జిల్లా:**

అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 9వ తారీఖు సాయంకాలం 7 గం॥ లకు అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయం నుండి జిల్లా కన్వీనర్ డా॥ జె. శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఒక ర్యాలీగా బయలుదేరి అనంతపురంలో క్లాక్‌టవర్ వద్దకు వెళ్ళారు. అక్కడ అవినీతి వ్యతిరేక దినోత్సవం గూర్చి ప్రసంగాలు చేసి, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. అవినీతి దిష్టిబొమ్మను దగ్ధం చేసి అవినీతి మీద అందరూ యుద్ధం చేయాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులతో పాటు సెక్రటరీ వన్నూరప్ప, కోశాధికారి నాగరాజు, సత్యనారాయణ, వెంకటలక్ష్మి, సరస్వతి మరియు వెంకటేష్, మధు, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

**పశ్చిమగోదావరి :**

భీమవరం : అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భగా భీమవరం పట్టణంలో విద్యార్థుల్లో అవినీతి దుష్ఫలితాల పట్ల అవగాహన కల్పిస్తూ 300 మంది విద్యార్థులతో ర్యాలీ తీయడం జరిగింది. ఈ ర్యాలీలో లోక్‌సత్తా సభ్యులు జి. రాజేశ్వర్ రావ్, ఎమ్. కృష్ణం రాజు, ఎమ్.వి. సుబ్బరాజు జి. నరసింహరాజు, డా॥ వేణుగోపాల్ రాజు, పి. శైలజ, బి. విజయలక్ష్మి, టి. సతీష్‌కుమార్, జి. రాజశేఖర్, పి. పధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం :**

సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న అవినీతిని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాకుళం డీఎస్పీ టి.ఎస్పీ టి. పనసారెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం సందర్భంగా లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కళాశాలల విద్యార్థులు బుధవారం స్థానిక సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. ఏడు రోడ్లు కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి అవినీతిని అంతమొందించడంలో తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి డి. విష్ణుమూర్తి మాట్లాడుతూ యువత అవినీతి అంతంపై రాజీలేని పోరాటాన్ని చేయాలని పిలుపునిచ్చారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు కె. పోలినాయుడు మాట్లాడుతూ విలువలతో, ఆధ్యాత్మిక భావాలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సత్తా అధ్యక్షురాలు ఎ. వసంతలక్ష్మి, లోక్‌సత్తా జిల్లా కార్యదర్శి బి. జగదీష్, కోశాధికారి అల్లు మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఎంవీఎస్ శాస్త్రి, చిక్కోలు స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.






**విజయనగరం:** మున్సిపాల్టీల్లో ప్రజలు చెల్లించే పన్నులకు తగిన విధంగా సేవలు అందించాలని 'జాతీయస్ఫూర్తి' పత్రిక సంపాదకులు డి.వి.వి.యస్. వర్మ తెలిపారు. అవినీతి లేని పాలన అందించాలన్నారు. అందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. శనివారం ఇక్కడ కృషిభవన్‌లో జరిగిన లోక్‌సత్తా అధ్వర్యంలో 'మున్సిపాల్టీల్లో పౌరులు కేంద్రంగా పాలన ఎలా'? అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, జిల్లా కార్యదర్శి బెవర వేణుగోపాల్, మహిళాసత్తా జోనల్ కార్యదర్శి ఐ. అనంతలక్ష్మి, రిటైర్డ్ ఆర్డీఓలు వై. సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, విజయనగరం, పార్వతీపురం, సాలూరు మున్సిపాల్టీలకు చెందిన లోక్‌సత్తా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ జిల్లా:**

## అడిక్‌మెట్ డివిజన్‌లో కలుషిత సరఫరాను అరికట్టండి





అడిక్‌మెట్ డివిజన్‌లోని బాప్టిస్ట్ చర్చివద్ద అనేక రోజులుగా నెలకొన్న కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అడిక్‌మెట్ డివిజన్ లోక్‌సత్తా అధ్యక్షులు కౌండిన్యప్రసాద్ బస్తీవాసులతో కలిసి బుధవారం వాటర్ వర్క్స్ డీజీఎం జైస్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ చర్చివద్ద అనేకరోజులగా మంచినీటి బదులుగా కలుషిత నీరు సరఫరా అవుతుందని ఈ విషయంపై బస్తీవాసులు స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయగా ఆమె ఈ నెల 5వ తేదీన పర్యటించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా, ఇంతవరకు పరిష్కారం కాలేదని ఆయన డీజీఎం జస్వాల్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ డివిజన్ నాయకులు హనుమంతు యాదవ్, లక్ష్మణ్‌వర్మ, తాండవ కృష్ణ పాల్గొన్నారు. ★

**లక్షలాది మంది ఆకలితో, అజ్ఞానంతో జీవించి ఉన్నంత కాలం, వారి మూలంగా విద్యావంతుడయి వారిని గురించి పట్టించుకోని ప్రతి వ్యక్తినీ నేను ద్రోహిగా పరిగణిస్తాను.** – స్వామి వివేకానంద

# లోక్‌సత్తా పార్టీ కి తోడ్పాటునివ్వండి

ప్రియమైన మిత్రులకు,

అక్టోబరు 2, 2006న లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. భారత ఎన్నికల కమిషన్ దగ్గర అధికారయుతంగా రిజిస్టరు అయింది. లోక్‌సత్తా పార్టీ మనసా, వాచా, కర్మణా ఒక జాతీయ పార్టీగా వ్యవహరిస్తుంది. పార్టీ ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలు ముఖ్యం అని భావిస్తుంది. కుల, మత, ప్రాంతీయ, భాషావిభేదాలకు అతీతంగా మనం అందరం భారతీయులం అన్న భావనతో వ్యవహరిస్తుంది.

ప్రస్తుత రాజకీయం పతనావస్థలో వుంది. క్షీణ సంస్కృతిలో వుంది. సమాజహితం కోసం చేసే ఒక పవిత్ర కార్యకలాపంగా వుండాల్సిన రాజకీయం కేవలం అధికార క్రీడగా మారింది. అందుకోసం డబ్బుసంచుల మీద, నేర చరితుల మీద, అవినీతి మీద ఆధారపడి మనుగడ సాగిస్తున్నది. స్వాతంత్ర్య ఫలాలు, ప్రజాస్వామ్య ఫలాలు ప్రజలకు అందకుండా పోతున్నాయి. ఈ క్షీణ రాజకీయ సంస్కృతిని రూపుమాపాలి. ఇదొక చారిత్రక అవసరం. ఈ చారిత్రక అవసరాన్ని నెరవేర్చడానికి ప్రస్తుత రాజకీయాన్ని మార్చడం లక్ష్యంగా ఒక కొత్త రాజకీయాన్ని, కొత్త సంస్కృతిని సాధించే కొత్త తరహా పార్టీగా లోక్‌సత్తా పార్టీ రూపుదిద్దుకుంది.

చెడ్డవారి దుర్మార్గం కంటే మంచి వారి మౌనం చేటు అన్నది సూక్తి. మంచి రాజకీయం కోరే వారంతా మౌనం వీడాలి. గళం విప్పాలి. ఒక వేదికలో సంఘటితం కావాలి. లోక్‌సత్తా పార్టీ అలాంటి వేదికగా వ్యవహరిస్తుంది. ఈ వేదికలో మీరు, మీ మిత్ర బృందం ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలుపంచుకోవలసిందిగా కోరుతున్నాం.

ప్రజాస్వామ్యానికి రాజకీయ పక్షాలు అవసరం. సమాజహితం కోసం, రాజకీయం నిర్వహించడానికి పార్టీలకు నిధులు అవసరం. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇస్తే పూర్తి పన్ను రాయితీ కల్పిస్తూ చట్టం కూడా వచ్చింది. ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఓట్ల కొనుగోళ్ల కోసం, మద్యం పంపిణీ కోసం, ఇతర ప్రలోభాల కోసం, నేర చరితుల పోషణ కోసం చేసే చట్ట విరుద్ధమైన ఖర్చుల కోసం చట్ట విరుద్ధమైన నిధుల సేకరణ మీద ప్రధానంగా ఆధారపడుతున్నాయి.

లోక్‌సత్తా పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు ఎట్టి పరిస్థితులలోనూ ఓట్ల కొనుగోళ్ళకీ, మద్యం పంపిణీ తదితర ప్రలోభాలకీ వారి స్వంత సొమ్ము కాని, విరాళాల సొమ్ము గాని వినియోగించరు. ఎన్నికల కమిషన్ పెట్టిన పరిమితికి లోబడి చట్టబద్ధంగానే ఖర్చు చేస్తారు.

లోక్‌సత్తా పార్టీ పూర్తిగా చట్టబద్ధంగానే విరాళాలు సేకరిస్తుంది, చట్టబద్ధమైన ఖర్చులకే వినియోగిస్తుంది. మీరు చెక్కు ద్వారా లేదా నగదు రూపంలో రశీదు తీసుకుని విరాళం ఇవ్వండి. ఆ మొత్తానికి మీరు ఆదాయపు పన్ను రాయితీని పూర్తిగా పొందవచ్చును. మీరు ఇచ్చే ప్రతి రూపాయి సమాజహితం కోసం చేసే మంచి రాజకీయానికి వినియోగిస్తాం. అందుచేత ఉదారంగా విరాళం ఇచ్చి లోక్‌సత్తా పార్టీకి తోడ్పాటు ఇవ్వవలసిందిగా కోరుతున్నాం.

అభివందనాలతో...

**(డా॥ జయప్రకాష్ నారాయణ్)**
లోక్‌సత్తా పార్టీ జాతీయ సమన్వయకర్త

**Note:**

1. Lok Satta Party is registered as a political Party under section 29A of 'Representation of the people Act 1951' with Election Commission of India vide proceedings No. 56/152/2006/J.S.III/320 dated 22nd December 2006.
2. As per the provisions of Section 80 GGB of Income Tax Act, any sum contributed by an Indian Company to Lok Satta Party is fully deductable from its total income for the corresponding year, subject to a ceiling of 5% of the net average annual profit of three latest accounting years.
3. As per the provisions of Section 80 GGC of income Tax Act any contribution made by any person to Lok Satta Party is fully deductable form his/her total income for the corresponding year. There is no ceiling on such personal contributions. Tax exemption will apply to any amount.

# అందరూ పుట్టుకతో సమానం - ఎదిగేటప్పుడు తేడాలెందుకు

## పాత రాజకీయంతో...



నాసిరకం చదువు
పై చదువులకి దూరం



చాలీచాలని సంపాదన
నిరుద్యోగం

ఉన్నవాడికో చదువు
లేనివాడికో చదువు



కలెక్టరు కొడుకుతో
సమానంగా
సామాన్యుల పిల్లలకి
చదువు

**మీ బిడ్డకి మీరేమిస్తారు**
**మీరే తేల్చుకోండి**

శాశ్వత
బీదరికమా?

మంచి విద్యతో
స్వతంత్ర జీవనమా?

## ఇది కొత్త రాజకీయం



మంచి పాఠశాల విద్య
ఆటపాటల బాల్యం
ఉన్నత చదువులు




మంచి ఉద్యోగాలు
మంచి సంపాదన

ప్రభుత్వ - ప్రయివేటు
స్కూళ్ళలో ఒకే ప్రమాణాలు

ఇంగ్లీషు విద్య
కంప్యూటర్ విద్య

విద్యా వ్యవస్థలో
టీచర్లకి కీలక పాత్ర

మంచి వసతులు
బోధనా పరికరాలు
ఇంటర్నెట్

## కొత్త రాజకీయంతో...



**ఉన్నత ప్రమాణాల**
**చదువు ఉచితం**

12వ తరగతి వరకు
అందరికీ చదువు ఉచితం

ప్రతి 40 మంది
పిల్లలకి ఒక టీచర్

అవసరమయిన చోట
ఉచిత హాస్టల్ వసతి,
రవాణా సౌకర్యం

# అంతరాలు లేని చదువు - మీ పిల్లలకు చింతలేని భవిష్యత్తు

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, for and on behalf of Foundation for Democratic Reforms ,
Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 0082, and printed at Kala Jyohti Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad